మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే

గురువారం THURSDAY 8-1-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 190 Issue: 190

Published from Jagitial
www.evarthalu.com

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు పుష్య మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:52 సూర్యాస్తమయం - సా. 5:53 తిథి పంచమి ఉ. 6:33 వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం పూర్వ ఫల్గుని(పుబ్బ) మ. 12:24 వరకు తరువాత ఉత్తర ఫల్గుని(ఉత్తర) యోగం సౌభాగ్య సా. 5:29 వరకు కరణం గరజి సా. 6:49 వరకు వనిజ ఉ. 7:050 వరకు వర్జ్యం రా. 7:59 నుండి రా. 9:40 వరకు దుర్ముహూర్తం ఉ. 10:32 నుండి ఉ. 11:16 వరకు మ. 2:56 నుండి మ. 3:40 వరకు రాహుకాలం మ. 1:45 నుండి మ. 3:08 వరకు యమగండం ఉ. 6:52 నుండి ఉ. 8:14 వరకు గుళికాకాలం ఉ. 9:37 నుండి ఉ. 11:00 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:16 నుండి ఉ. 6:04 వరకు అమృత ఘడియలు తె. 5:52 నుండి ఉ. 7:30 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:00 నుండి మ. 12:44 వరకు గమనిక: "౦" అనగా మరుసటి రోజున





# కుక్కలపై అంత ప్రేమెందుకో?

## కోళ్లు, మేకలవి ప్రాణాలు కావా?

### వీధికుక్కల దాడులపై సుప్రీం వ్యాఖ్యలు

దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న వీధి కుక్కల దాడుల సమస్యపై సుప్రీం కోర్టులో బుధవారం ఆసక్తికరమైన వాదనలు జరిగాయి. జంతు ప్రేమికులు కేవలం కుక్కల గురించి మాట్లాడుతుండటంపై ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. 'మనం కేవలం కుక్కల గురించే ఎందుకు చర్చిస్తున్నాం? కోళ్లు, మేకల పరిస్థితి ఏంటి? వాటికి ప్రాణాలు ఉండవా?' అని జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం నిలదీసింది.

న్యూఢిల్లీ: విచారణ సందర్భంగా వీధి కుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోయిన 90 ఏళ్ల వృద్ధుడి ఫొటోను చూపించేందుకు ఒక పిటిషనర్ ప్రయత్నించగా.. కోర్టు దానిని సున్నితంగా తిరస్కరించింది. బాధితుల తరపు న్యాయవాదులు వాదిస్తూ.. వీధి కుక్కల వల్ల సామాన్యులు నరకం చూస్తున్నారని, కుక్కల హక్కుల కంటే మానవ హక్కులను కాపాడటం అత్యవసరమని పేర్కొన్నారు. జపాన్, అమెరికా వంటి దేశాల్లో కుక్కలను షెల్టర్లకు తరలించి, ఎవరూ దత్తత తీసుకోకపోతే -2 వ పేజీలో...



# కవితకు అంత ఈజీ కాదు

## కొత్త పార్టీపై గుత్తా కీలక వ్యాఖ్యలు

తెలంగాణ జాగృతిని రాజకీయ పార్టీగా మారుస్తానంటూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించిన సంగతి తెలిసిందే. ఉగాది నాటికి కొత్త పార్టీపై ప్రకటన చేస్తానని తెలిపారు. ఈ క్రమంలో తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కవిత కొత్త పార్టీ అంశంపై స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు.

హైదరాబాద్, జనవరి 7 (ఈవార్తలు): ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీ స్థాపించి, మనుగడ సాధించడం కష్టమన్నారు. ఇప్పటికే చాలా రాజకీయ పార్టీలున్నాయని, పార్టీలు పెట్టి నిలబెట్టుకోవడం అంత సులభం కాదన్నారు. బుధవారం మీడియాతో చిట్‌చాట్ నిర్వహించిన -2 వ పేజీలో...

# కవిత వర్క్ స్టార్ట్!

## తెలంగాణ అభివృద్ధికి జాగృతి బ్లూప్రింట్

### 30 కమిటీల ఏర్పాటుకు నిర్ణయం

### 17న జాగృతి స్టీరింగ్ కమిటీకి నివేదికలు

### నివేదికల ఆధారంగా ప్రజాక్షేత్రంలోకి



తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రస్ఫుటింపజేసేలా రాజకీయ కార్యాచరణ ప్రకటిస్తానని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో స్వీయ రాజకీయ శక్తిగా నిలుస్తామని స్పష్టం చేసిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.. ఆ దిశగా అడుగులు వేశారు. ప్రజాస్వామిక పద్ధతిలో అన్నివర్గాల ప్రజల ఆకాంక్షలను ప్రతిఫలింపజేస్తూ కమిటీలు ఏర్పాటు చేసి వాటి నివేదికల ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు.

హైదరాబాద్, జనవరి 7 (ఈవార్తలు): ఈ క్రమంలో జాగృతి ముఖ్య నాయకులు బుధవారం సమావేశమై 'పుష్కరకాల తెలంగాణ రాష్ట్రం - సంపూర్ణ అధ్యయనం' సహా 30 కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. దేశంలోని, రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీల రాజ్యాంగాలను స్టడీ చేసి జాగృతికి ప్రజాస్వామ్యబద్ధమైన, పటిష్టమైన రాజ్యాంగాన్ని రూపొందించడానికి న్యాయ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేశారు. ఎడ్యుకేషన్, హెల్త్, ఎంప్లాయిమెంట్, రైతు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎంబీసీ సాధికారత, కార్మిక, సింగరేణి, కాంట్రాక్టు ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, లిటరేచర్, హిస్టరీ ఉ హెరిటేజ్, ఎంప్లాయిస్, టీచర్స్, మహిళా సాధికారత, శిశు సంక్షేమం, యూత్ ఎంపవర్మెంట్, ఆన్ లైన్ కంటెంట్, ఉద్యమకారుల సంక్షేమం, ఇరిగేషన్, బడ్జెట్ ఎనాలిసిస్, మైనార్టీల సాధికారత, వలస (గల్ఫ్) కార్మికుల సంక్షేమం, స్టూడెంట్స్, రెవెన్యూ రిఫార్మ్స్ విభాగాల్లో విద్యావంతులు, నిపుణులతో కమిటీలు ఏర్పాటు చేశారు. ఒక్కో కమిటీలో ముగ్గురు నుంచి నలుగురు సభ్యులను నియమించారు. ప్రతి కమిటీలో విద్యావంతులైన మహిళలకు అవకాశం ఇచ్చారు. కమిటీల బాధ్యులు తరువాయి 2 వ పేజీలో...




# ఈ నెలలోనే 'పట్టణ' ప్రకటన!

## 20 నాటికి నోటిఫికేషన్ వచ్చే చాన్స్

### ఆ దిశగా ఎన్నికల సంఘం కసరత్తు.. 16న ఓటర్ల తుది జాబితా ప్రచురణ

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు కౌంట్‌డౌన్ మొదలైంది. డిసెంబర్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ).. ఇప్పుడు పట్టణ పోరుపై దృష్టి సారించింది.

హైదరాబాద్, జనవరి 7 (ఈవార్తలు): జనవరి 20వ తేదీ నాటికి రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉండటంతో.. దానికి సంబంధించి ఎన్నికల సంఘం కమిషనర్ రాణికుముదిని అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ఖరారు చేసింది. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణకు చివరి తేదీ జనవరి 12 అని తెలిపారు. అదే రోజున ఓటర్ల తుది జాబితాను ప్రచురించాలని మొదట తరువాయి 2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.13,827 |
| వెండి (గ్రాము): | రూ.277 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,753 |

# ఆ ముగ్గురు.. 30%

## ఖమ్మం మంత్రులకు కేటీఆర్ కౌంటర్.. ర్యాలీలో వైసీపీ జెండాల హవా



ఖమ్మం, జనవరి 7 (ఈవార్తలు): 'గ్యారెంటీ కార్డు భద్రంగా పెట్టమన్నారు భట్టి విక్రమార్క మరి రెండేళ్లలో మీ హామీలు ఎక్కడ పోయాయి? ఇప్పుడు గ్యారెంటీ కార్డు ఎక్కడ పెట్టాలి?' అని మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. 'ఏం పని అయినా 30 శాతం కమీషన్ భట్టి విక్రమార్క అడుగుతున్నారు. ఏ భూమి సమస్యల వచ్చినా 30 శాతం భూమి బాంబులేటి అడుగుతున్నాడు. తుమ్మల నాగేశ్వరరావు కూడా కమీషన్లకు మరిగాడు' అని తీవ్ర ఆరోపణలు చేశారు. ఖమ్మం జిల్లాలో నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లను మాజీ మంత్రి కేటీఆర్ సన్మానించిన -2 వ పేజీలో...



# రేవంత్ సోదరుడికి సిట్ నోటీసులు

హైదరాబాద్, జనవరి 7 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత సోదరుడు కొండల్ రెడ్డికి స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ నోటీసులు పంపింది. గురువారం ఉదయం 11 గంటలకు విచారణకు రావాలని ఆ నోటీసులో అధికారులు పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి విపక్ష నాయకుడిగా ఉన్న రోజుల్లో కొండల్ రెడ్డి ఫోన్‌ను ట్యాప్ చేశారని దర్యాప్తులో తేలింది. ఈ నేపథ్యంలో ఆయన వాంగ్మూలం తీసుకోవడం కోసం విచారణకు పిలుస్తున్నారు. ఇదే తరువాయి 2 వ పేజీలో...



# శివాజీ వారసుడికి ఆక్స్‌ఫర్డ్ ప్రెస్ క్షమాపణలు

## 20 ఏళ్ల క్రితం ప్రచురితమైన పుస్తకంలోని వ్యాఖ్యలపై వివాదం

### ప్రజలకు కలిగిన ఆవేదనకు చింతిస్తున్నామని ప్రకటన

ఛత్రపతి శివాజీ మహారాజ్ 13వ తరం వారసుడైన ఉదయన్‌రాజే భోంస్లేకు ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ (ఓయూపీ) క్షమాపణలు తెలిపింది. రెండు దశాబ్దాల క్రితం తాము ప్రచురించిన ఓ పుస్తకంలో శివాజీ గురించి నిర్ధారించుకోని వ్యాఖ్యలు ఉన్నాయని అంగీకరించింది.

లండన్: ఛత్రపతి శివాజీ మహారాజ్ 13వ తరం వారసుడైన ఉదయన్‌రాజే భోంస్లేకు ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ (ఓయూపీ) క్షమాపణలు తెలిపింది. రెండు దశాబ్దాల క్రితం తాము ప్రచురించిన ఓ పుస్తకంలో శివాజీ గురించి నిర్ధారించుకోని వ్యాఖ్యలు ఉన్నాయని అంగీకరించింది. ఈ మేరకు ఓ పత్రికలో బహిరంగ ప్రకటన జారీ చేసింది. అమెరికన్ రచయిత జేమ్స్ లైన్ రాసిన 'శివాజీ: హిందూ కింగ్ ఇన్ ఇస్లామిక్ ఇండియా' -2 వ పేజీలో...

## విశ్వవాణి




కొంత మంది బౌద్ధమత గురువులు అమెరికాలోని ఫోర్ట్ వర్త్ (టెక్సస్) నుంచి వాషింగ్టన్ డీసీ వరకు ఏకంగా 3,700 కిలోమీటర్లు నడుస్తూ శాంతి, జాలి, దయ, కరుణ లాంటి అంశాలను ప్రజలకు బోధిస్తున్నారు. జపాన్‌కు చెందిన 'క్నోట్' టెక్ కంపెనీ.. ఆఫీస్‌లలో పిల్లులను ఉంచుతోంది. ఆ పిల్లుల వల్ల ఉద్యోగుల్లో ఒత్తిడి తగ్గుతోందట. వాటితో ఆడుకోవడం వల్ల పని ఒత్తిడి నుంచి రిలీఫ్ రిలీఫ్ కలుగుతోందట. దీంతో కంపెనీ మొత్తం 11 పిల్లులను పెంచుతోందట.

# గంజాయి సమాచారమిస్తే రూ.2 లక్షల ప్రైజ్

## విక్రయించినవారిపై రూ.5 లక్షల జరిమానా

### జగిత్యాల జిల్లా బొమ్మెనలో తీర్మానం



కథలాపూర్, జనవరి 7 (ఈవార్తలు): మాదక ద్రవ్యాల నిర్మూలనకు గొప్ప నిర్ణయం తీసుకుందో గ్రామం. జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం బొమ్మెన గ్రామపంచాయతీ పాలకవర్గం డ్రగ్స్ భూతంపై -2 వ పేజీలో...

# ఆర్టీసీ సంక్రాంతి బాదుడు

## స్పెషల్ బస్సులపై 50 శాతం అదనపు చార్జీలు



హైదరాబాద్, జనవరి 7 (ఈవార్తలు): సంక్రాంతి పండుగ వేళ తెలంగాణ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది. మొత్తంగా 6,431 ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు ప్రకటించింది. సంక్రాంతి పండుగకు ముందు 9, 10, 12, 13 తేదీల్లో... పండుగ తర్వాత 18, 19 తేదీల్లో ప్రత్యేక బస్సులు నడుస్తాయని పేర్కొంది. ప్రత్యేక బస్సుల్లో 50శాతం అదనపు చార్జీలు వసూలు చేయనున్నట్టు వెల్లడించింది. ఆయా ప్రాంతాలకు వెళ్లే స్పెషల్ బస్సులు ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్, ఆరాంఘర్, ఎల్బీనగర్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలిల నుంచి అందుబాటులో ఉంటాయని తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు
7.1.2026

మేషం: ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. చేపట్టిన వ్యవహారాలు సకాలంలో పూర్తి చేస్తారు. కుటుంబ సభ్యులతో వృత్తి ఉద్యోగాలలో ప్రోత్సాహకర ఉత్సాహకర వాతావరణం ఉంటుంది. కొన్ని పనులలో బంధు మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. వృత్తి వ్యాపారాలు ఆటంకాలు తొలగుతాయి.

వృషభం: ఆర్థిక అనుకూలత కలుగుతుంది. ఉద్యోగమున అంచనాలు నిజమవుతాయి. నూతన వ్యాపారాలు ప్రారంభించి లాభాలు అందుకుంటారు. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. సన్నిహితుల నుండి ఊహించని శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. కీలక వ్యవహారాలలో సొంత ఆలోచనలు కలసి వస్తాయి.

మిథునం: వ్యాపారమున స్వల్ప లాభాలు అందుతాయి. ఋణదాతల ఒత్తిడి పెరుగుతుంది. ముఖ్యమైన పనులు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగమున అధికారుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది. సంతాన అనారోగ్య విషయంలో సమస్యలుంటాయి. ఇతరులపై మీ అభిప్రాయం మార్చుకోవడం మంచిది. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు.

కర్కాటకం: చిన్ననాటి మిత్రుల ఆగమనంతో గృహమున సందడి వాతావరణం ఉంటుంది. ముఖ్యమైన వ్యవహారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. వృత్తి, వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. నిరుద్యోగులకు అనుకూల వాతావరణం ఉంటుంది. సమాజంలో ప్రముఖుల సహాయ సహకారాలు అందుతాయి.

సింహం: దాయదులతో స్థిరాస్తి వివాదాలు పరిష్కారమౌతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. ఆర్థిక వ్యవహారాలు లాభసాటిగా ఉంటాయి. వృత్తి వ్యాపారాలు గతం కంటే మెరుగవుతాయి. చేపట్టిన పనులలో అవరోధాలు అధిగమిస్తారు. సోదరులతో సఖ్యతగా వ్యవహరిస్తారు.

కన్య: ఖర్చుకు తగినంత ఆదాయం ఉండదు. దీర్ఘ కాలిక ఋణాలు తీర్చడానికి నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ఉద్యోగులకు అదనపు పనిబారం తప్పదు. కుటుంబ వ్యవహారాలలో ఆకస్మికంగా నిర్ణయాలు మార్చుకుంటారు. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి.

తుల: ధన వ్యవహారాలు ఉత్సహాన్నిస్తాయి. కొన్ని వ్యవహారాలలో కుటుంబ సభ్యుల సలహాలు కలసివస్తాయి. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. ఉద్యోగాలలో వివాదాలు రాజి చేసుకుంటారు. స్థిరాస్తి క్రయ విక్రయాలలో లాభాలు అందుకుంటారు. దైవ సేవా కార్యక్రమాలకు సహాయం అందిస్తారు.

వృశ్చికం: కుటుంబ సభ్యులుతో మాటపట్టింపులుంటాయి. చేపట్టిన పనులు వ్యయప్రయాసలతో కాని పూర్తికావు. నిరుద్యోగ ప్రయత్నాలు మందకోడిగా సాగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఉద్యోగాలలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు కొంత బాధిస్తాయి. అవసరానికి ధనంచేతిలో నిల్వఉండదు.

ధనస్సు: స్థిరస్తి కొనుగోలు ప్రయత్నాలకు ఆటంకాలు తొలగుతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అధికారుల ఆదరణ పెరుగుతుంది. ఆర్థిక పరంగా మరింత పురోగతి కలుగుతుంది. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

మకరం: ఉద్యోగాలలో పనితీరుకు తగిన ప్రశంసలు అందుకుంటారు. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. గృహమున శుభకార్యములు నిర్వహిస్తారు. చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. నూతన వ్యాపారమునకు పెట్టుబడులు అందుతాయి.

కుంభం: ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలున్నవి. మీప్రవర్తన వలన ఇతరులకు ఇబ్బంది కలిగిస్తుంది. ఋణ దాతల ఒత్తిడి పెరుగుతుంది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపార ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి. నిరుద్యోగ ప్రయత్నాలు కలసిరావు. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.

మీనం: దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఇతరులకు ధన పరంగా మాట ఇచ్చే విషయంలో జాగ్రత్త వహించాలి. చేపట్టిన పనులలో శ్రమ పెరుగుతుంది. బంధు మిత్రులతో మనస్పర్థలు కలుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో సమస్యలు ఉంటాయి. ధనపరమైన ఇబ్బందులు చికాకు పరుస్తాయి.

# కుక్కలపై అంత ప్రేమెందుకో?

మొదటి పేజీ తరువాయి

వాటిని కారుణ్య మరణం ద్వారా చంపేస్తారని, అందుకే అక్కడ రేబిస్ మరణాలు లేవని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. నోయిడాలో కుక్కల దాడికి గురైన ఎనిమిదేళ్ల చిన్నారి తండ్రి మాట్లాడుతూ.. రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు తమ కాలనీలను నో డాగ్ జోన్స్‌గా ప్రకటించే అధికారం ఇవ్వాలని కోరారు. జంతు ప్రేమికుల తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ.. తాము కేవలం కుక్కలనే కాకుండా పర్యావరణాన్ని కూడా ప్రేమిస్తామని చెప్పారు. 'నేను కోడి మాంసం తినడం మానేశాను. ఎందుకంటే వాటిని పంజరాల్లో బంధించి, బలవంతంగా చంపి మాంసం అమ్మడమే కారణం' అని కోర్టు ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. వీధి కుక్కల జనాభాను తగ్గించేందుకు ప్రపంచ వ్యాప్తంగా అనుసరిస్తున్న 'క్యాప్చర్, స్టెరిలైజ్, వ్యాక్సినేట్, రిలీజ్' పద్ధతి విజయవంతమైందని ఆయన పేర్కొన్నారు. కుక్కలను పూర్తిగా షెల్టర్లలో ఉంచడం మున్సిపాలిటీలపై భారీ ఆర్థిక భారాన్ని మోపుతుందని, చెత్త కుప్పలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కుక్కలను తొలగిస్తే కోతుల బెడద పెరుగుతుందని విశ్లేషించారు. ప్రభుత్వం తరపున సోలిసిటర్ జనరల్ స్పందిస్తూ.. ప్రస్తుతం జరుగుతున్న చర్చలన్నీ కేవలం కుక్క ప్రేమికుల చుట్టూనే తిరుగుతున్నాయని, జంతు ప్రేమికుల గురించి కాదని చురకలు అంటించారు. ఒక గేటెడ్ కమ్యూనిటీలో 90 శాతం మంది వద్దన్నా, 10 శాతం మంది కోసమే కుక్కలను ఉంచడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రేపు ఎవరైనా తమ ఇంట్లో ఆవును లేదా గేదెను కట్టేస్తామంటే ఒప్పుకుంటామా? అని నిలదీశారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయస్థానం స్కూళ్లు, ఆసుపత్రులు, కోర్టుల వంటి సంస్థాగత ప్రాంతాల నుంచి కుక్కలను తొలగించాలనే తమ ఆదేశాలపై అభ్యంతరాలు ఎందుకని ధర్మాసనం ప్రశ్నించింది. కుక్క ప్రేమికులు, వ్యతిరేకులు ఇద్దరి వాదనలను ఓపికగా వింటామని కోర్టు స్పష్టం చేసింది.





# కవితకు అంత ఈజీ కాదు

మొదటి పేజీ తరువాయి

ఆయన.. 'ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీ స్థాపించి, దాన్ని నిలబెట్టుకోవడం సామాన్యమైన అంశం కాదు. గతంలో చిరంజీవి, దేవెందర్ గౌడ్ పార్టీలు పెడితే ఏమయ్యాయో చూశాం కదా' అన్నారు. కవిత రాజీనామాపై స్పందిస్తూ... రాజీనామా 'ఇన్‌పర్సన్ల (వ్యక్తిగతంగా) ఇస్తే ఆమోదం తెలుపుతామన్నారు. సభ్యులు కాకుండా ఇతరులు ఇస్తే ఆమోదం తెలపలేమన్నారు. కవిత ఇన్‌పర్సన్ ఇచ్చారు. అందుకే ఆమోదం తెలిపాను' అన్నారు. 'ముందుగా ఆమె తన పీఏ ద్వారా రాజీనామా పంపారు. దీని గురించి మీడియా సమావేశంలో చెప్పుకొచ్చారు. ఇలా చేస్తే రాజీనామా ఆమోదించలేము అన్నారు. ఆ తర్వాత ఆమె నేరుగా కలిసి రాజీనామా ఆమోదించాలని కోరారు. అలానే తనకు ఒక్కసారి మాట్లాడే అవకాశం ఇవ్వాలని కోరారు. రాజీనామా చేసే వారి ఎవరికైనా మాట్లాడే అవకాశం ఇవ్వాలి. కవిత విషయంలో కూడా అదే చేశామన్నారు' గుత్తా.




# ఈ నెలలోనే 'పట్టణ' ప్రకటన!


మొదటి పేజీ తరువాయి

ఆదేశించారు. టీ పోల్ యాప్‌లో, ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను జనవరి 13వ తేదీన అప్‌లోడ్ చేయాలి. జనవరి 16వ తేదీన ఫోటోలతో కూడిన ఓటర్ల తుది జాబితా ప్రచురించనున్నారు. వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల వివరాలను కూడా ఆరోజే వెల్లడిస్తారు. ఇక జనవరి 20వ తేదీన మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. 2019 నాటి ఓటర్ల జాబితాను ప్రాతిపదికగా తీసుకుని.. బీఎల్‌వోల ద్వారా క్షేత్రస్థాయిలో వివరాల పరిశీలన జరుగుతోంది. ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రిని సిద్ధం చేయాలని కలెక్టర్లను ఈసీ ఆదేశించింది. ఎన్నికల నియమావళిని కఠినంగా అమలు చేయడానికి ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ ఏర్పాటుకు ఆదేశాలు జారీ అయ్యాయి. గురువారం రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల సంఘం కీలక సమావేశం నిర్వహించి, వారి సూచనలను తీసుకోనుంది. తుది ఓటర్ల జాబితాను ఆయా వార్డు పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. దీనివల్ల ఓటర్లకు తమ పోలింగ్ కేంద్రం, బూత్ వివరాలు తెలుస్తాయని ఈసీ వెల్లడించింది. మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన మౌలిక సౌకర్యాలపైనా కలెక్టర్లకు ఈసీ దిశానిర్దేశం చేసింది. బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సిబ్బంది నియామకం, రిటర్నింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్‌ను నియమించి.. ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించాలని ఎన్నికల కమిషన్ సూచించింది.

# కవిత వర్క్ స్టార్ట్!

మొదటి పేజీ తరువాయి

రానున్న పది రోజుల పాటు వారికి అప్పగించిన రంగాల్లో రాష్ట్రవ్యాప్తంగా అధ్యయనం చేసి నివేదిక రూపొందిస్తారు. తమ నివేదికలను ఈనెల 17వ తేదీన జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. రూప్ సింగ్ అధ్యక్షతన నియమించిన స్టీరింగ్ కమిటీకి సమర్పిస్తారు. స్టీరింగ్ కమిటీ నివేదికపై జాగృతి రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గం మరోసారి సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై అందరి అభిప్రాయలను పరిగణలోకి తీసుకొని నిర్ణయం తీసుకుంటుంది.



### కవిత జూమ్ కాన్ఫరెన్స్

జాగృతి రూపొందించబోయే రూట్ మ్యాప్ సిద్ధం చేయనున్న ఎజెండా కమిటీ సభ్యులతో కవిత బుధవారం రాత్రి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఈ ప్రాంతాన్ని పరిపాలించిన బీఆర్ఎస్, కాంగ్రెస్ వైఫల్యాలు, అన్ని పార్టీల రాజ్యాంగాల అధ్యయనం.. అత్యంత ప్రజాస్వామ్యయుతమైన రాజ్యాంగం రూపొందించడం, నీళ్లు – నిధులు – నియామకాలు సహా 32 అంశాల అధ్యయనానికి ప్రత్యేక కమిటీలు వేశామన్నారు. కమిటీ సభ్యులు క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసి ఈనెల 17లోగా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్ రూప్ సింగ్ అధ్యక్షతన ఏర్పాటుచేసినస్టీరింగ్ కమిటీకి నివేదిక ఇవ్వాలని సూచించారు.

# ఆ ముగ్గురు.. 30%

మొదటి పేజీ తరువాయి

అనంతరం కీలక ప్రసంగం చేశారు. 'కాంగ్రెస్ ఓటమికి రంగం సిద్ధం అయింది. ముగ్గురు మంత్రులు ఉన్నా, యూరియా బస్తాలు దొరకడం లేదు. రైతులు అరిగోస పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ మీద ఖమ్మం ప్రజల్లో ఆగ్రహం, వ్యతిరేకత కనిపిస్తోంది. బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ నామమాత్రంగా సర్పంచులను గెలిచింది.. కానీ బీఆర్ఎస్ 40 శాతం సర్పంచ్‌లు గెలిచింది' అని వెల్లడించారు. 'షాపుల్లో యూరియా లేదు. యూరియా కార్డుతో కొత్త నాటకం ఆడుతున్నారు. ఈ దౌర్భాగ్యులు వచ్చాక రైతుల పరిస్థితి దారుణంగా తయారైంది. రేవంత్ రెడ్డికి వ్యవసాయం గురించి తెలియదు. నదీ జలాల మీద అవగాహన లేదు. బాక్రానంగల్ ప్రాజెక్ట్ తెలంగాణలో ఉందట. బేసిన్లు కూడా తెలీదు' అని రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. 'కేసీఆర్ చేసిన అప్పు తెలంగాణ మీద పెట్టుబడి. రైతుల కోసం, భావితరాల మీద పెట్టిన పెట్టుబడి. భవిష్యత్ కోసం, అభివృద్ధి మీద కేసీఆర్ ఖర్చు చేశారు. కేసీఆర్ మీలాగా దోచుకోలేదు' అని కాంగ్రెస్‌పై దుమ్మెత్తిపోశారు. 'తెలంగాణను దోచుకొని ఢిల్లీ కప్పం కడుతున్నారు. రాహుల్ గాంధీకి కప్పం కట్టకలేదు పోస్ట్ ఊస్టే! పదవి పోతుందని, నెల నెలా ఢిల్లీకి కప్పం కడుతున్నారు' అని రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'రెండు దీపావళులు పోయాయి కానీ బాంబులు పేలలేదు. సిగ్గు లేకుండా అదానీ, అంబానీ, మోదీ కాళ్ల మీద పడి ఈడీ కేసు మాఫీ చేయించుకుంటున్నాడు. బీజేపీలో చేరతానని మోదీ ఎదుట మోకరిల్లి, బీజేపీ ముందు మోకరిల్లి ఈడీ కేసు మాఫీ చేయాలని తిరుగుతుండు' అని పొంగులేటిపై విమర్శలు చేశారు. 'ఇంకో మంత్రి కార్పొరేటర్ల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నాడు. మా ముగ్గురు కార్పొరేటర్లను చేర్చుకుంటుండు. ప్రజలు అనుకుంటే తుమ్మల ఏం చేయలేరు. మా కార్పొరేటర్ పోతే ఏం కాదు. జనం అనుకోవాలి అంతే. జనం అనుకుంటే ఏది ఆగదు' అని అన్నారు. 2014లో ఓడిపోయి ఇంట్లో ఉంటే మిత్రుడని భావించి తుమ్మలను కేసీఆర్ పిలిచి మంత్రి పదవి ఇచ్చారని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలోనే ఖమ్మం జిల్లాలో అభివృద్ధి జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర చంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, సండ్ర వెంకట వీరయ్య, కందాళ ఉపేందర్ రెడ్డి, హరిప్రియ నాయక్, మెచ్చా నాగేశ్వరరావు, వనమా వెంకటేశ్వరరావు, చంద్రావతి, తాటి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ గ్రంథలయ సంస్థ చైర్మన్లు దిండిగల రాజేందర్, ఖమర్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ సంక్రాంతి బాదుడు

మొదటి పేజీ తరువాయి

తెలిపింది. ప్రయాణికుల సౌకర్యార్థం స్పెషల్ బస్సుల బోర్డింగ్ పాయింట్ల వద్ద తాత్కాలిక షెల్టర్లు, షామియానాలు, కూర్చునే ఏర్పాట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌లు, తాగునీటి సౌకర్యాలు, మొబైల్ టాయిలెట్లు వంటి సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నట్టుగా టీజీఎస్‌ఆర్టీసీ తెలిపింది. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ప్రధాన పండుగల సమయంలో ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నామని ఆర్టీసీ యాజమాన్యం పేర్కొంది. 2003లో జారీ చేసిన జీవో నెం. 16 ప్రకారం... అదనపు ఇంధనం, నిర్వహణ ఖర్చులను భరించడానికి పండుగలు, ప్రత్యేక సందర్భాలలో నడిపే ప్రత్యేక బస్సులకు టిక్కెట్ చార్జీలను 1.5 రెట్లు వరకు సవరించడానికి సంస్థకు అనుమతి ఉందని కూడా టీజీఎస్‌ఆర్టీసీ పేర్కొంది. అయితే 50 శాతం అదనపు చార్జీలు సంక్రాంతి స్పెషల్ బస్సులలో మాత్రమే వసూలు చేస్తారని తెలిపింది. రాష్ట్రంలోని నడిచే బస్సులతో పాటు ఇతర రాష్ట్రాలకు నడిచే స్పెషల్ బస్సులలో కూడా ఈ చార్జీలు వర్తిస్తాయని పేర్కొంది. ఈ సవరించిన చార్జీలు జనవరి 9, 10, 12, 13, 18 మరియు 19 తేదీలలో మాత్రమే వర్తిస్తాయని కూడా తెలిపింది. అదే సమయంలో రెగ్యులర్ సర్వీసు బస్సులు యథవిధిగా సాధారణ చార్జీలతోనే నడుస్తాయని సంస్థ స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం కింద సంక్రాంతి పండుగ సమయంలో కూడా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం యథవిధిగా కొనసాగుతుందని కూడా టీజీఎస్‌ఆర్టీసీ స్పష్టతనిచ్చింది.

## రేవంత్ సోదరుడికి సిట్ నోటీసులు

మొదటి పేజీ తరువాయి

కేసులో మరో ఇద్దరు బీఆర్ఎస్ నేతలకూ నోటీసులు వెళ్లాయి. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, చిరుమర్తి లింగయ్యను కూడా హాజరు కావాలని పోలీసులు ఆదేశించారు. ఇప్పటికే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావు తండ్రి కొండలరావు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుమారుడు సందీప్ రావుకు ఇలాంటి నోటీసులే జారీ అయ్యాయి.

## ఆక్స్‌ఫర్డ్ ప్రెస్ క్షమాపణలు

మొదటి పేజీ తరువాయి

అనే పుస్తకాన్ని 2003లో ఓయూపీ ప్రచురించింది. ఈ పుస్తకంలోని 31, 33, 34, 93 పేజీలలో ఉన్న కొన్ని వ్యాఖ్యలు అవాస్తవాలని, వాటిని నిర్ధారించుకోలేదని ఓయూపీ ఇండియా తమ ప్రకటనలో అంగీకరించింది. ఈ వ్యాఖ్యల ప్రచురణ పట్ల విచారం వ్యక్తం చేస్తున్నామని, దీనివల్ల ఉదయన్‌రాజే భోంస్లేతో పాటు ప్రజలకు కలిగిన బాధకు, ఆవేదనకు క్షమాపణ కోరుతున్నామని పేర్కొంది. ఓయూపీ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ సయీద్ మంజార్ ఖాన్ తరఫున ఈ క్షమాపణలు చెబుతున్నట్లు తెలిపింది. కాగా, ఈ పుస్తకం విడుదలైన సమయంలో పెను వివాదం చెలరేగింది. శివాజీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని, రచయితకు పుణెలోని ప్రఖ్యాత భండార్కర్ ఓరియంటల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సహాయం చేసిందని ఆరోపిస్తూ.. 2004 జనవరిలో సంభాజీ బ్రిగేడ్‌కు చెందిన సుమారు 150 మంది కార్యకర్తలు ఆ సంస్థపై దాడి చేసి ధ్వంసం చేశారు. ఈ ఘటన జరిగిన రెండు దశాబ్దాల తర్వాత ఆక్స్‌ఫర్డ్ ప్రెస్ నుంచి క్షమాపణ రావడం గమనార్హం.

## సమాచారమిస్తే రూ.2 లక్షల ప్రైజ్

మొదటి పేజీ తరువాయి

పిడికిలి బిగించింది. గ్రామంలో గంజాయి, ఇతర డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిస్తే సాక్ష్యధారాలతో పట్టిస్తే, వారికి రూ.2 లక్షల ప్రైజ్ మనీ అందజేస్తామని పాలకవర్గం బుధవారం తీర్మానం చేసింది. డ్రగ్స్ అమ్మేవారికి రూ.5 లక్షల జరిమానా విధిస్తామని స్పష్టం చేసింది. గ్రామాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఈ గ్రామ నిర్ణయంపై అన్ని వర్గాల నుంచి అభినందనలు వస్తున్నాయి. బొమ్మెనలాగే అన్ని గ్రామాలు డ్రగ్స్ రహిత సమాజం కోసం పాటుపడాలని పోలీసులు ఆకాంక్షస్తున్నారు.



# అనుభవమా.. అధికారమా..?

## అవమానమా.. అంగీకారమా?.. ఎమ్మెల్యే వర్సెస్ మాజీ ఎమ్మెల్సీ... జగిత్యాల కాంగ్రెస్‌లో చిచ్చు

(కాలగిరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్)

జగిత్యాల నియోజకవర్గ రాజకీయాలు ప్రస్తుతం వ్యక్తిగత విభేదాలకే పరిమితం కాకుండా, కాంగ్రెస్ పార్టీ అంతర్గత రాజకీయ సంస్కృతిని ప్రశ్నించే స్థాయికి చేరుకున్నాయి. నాలుగు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ పార్టీతో అనుబంధం కలిగి, అనేక రాజకీయ పోరాటాలు చూసిన మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి మరియు రెండుసార్లు బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం అదే పార్టీలో చేరిన ప్రస్తుత ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మధ్య కొనసాగుతున్న విభేదాలే ఈ ఉద్రిక్త పరిస్థితికి కేంద్రబిందువుగా నిలుస్తున్నాయి. సాధారణంగా పార్టీ మార్పులు తెలంగాణ రాజకీయాల్లో కొత్తవి కావు. కానీ ఇక్కడ సమస్య పార్టీ మారడంలో కాదు.. అది జరిగిన విధానంలో, ఆ తరువాత ఏర్పడిన శక్తి సమీకరణాల్లో ఉంది. సంజయ్ కుమార్ రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో "జగిత్యాల అభివృద్ధి కోసమే అధికార పార్టీకి దగ్గరవుతున్నాను" అంటూ కాంగ్రెస్‌లో చేరారు. ఈ నిర్ణయం ఒకవైపు రాజకీయ వ్యూహంగా కనిపించినా, మరోవైపు పార్టీని దశాబ్దాలుగా నమ్ముకుని పనిచేసిన నేతల మనోభావాలను గాయపరిచిన చర్యగా మారింది. ప్రధానంగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి అసంతృప్తికి కారణం.. తనకు కనీస సమాచారం ఇవ్వకుండా, స్థానిక నాయకత్వాన్ని సంప్రదించకుండా సంజయ్ కుమార్‌ను పార్టీలో చేర్చుకోవడమే. ఈ అంశాన్ని ఆయన పలుమార్లు బహిరంగంగానే ప్రస్తావించారు.



"నాలుగు దశాబ్దాలుగా పార్టీ కోసం పనిచేసిన వారిని పక్కన పెట్టి, నిన్న మొన్నటి వరకు ప్రత్యర్థి పార్టీలో ఉన్న నేతకు ప్రాధాన్యం ఇవ్వడం ఏ విధమైన రాజకీయ న్యాయం?" అనే ప్రశ్న ఆయన అసంతృప్తిలో ప్రధాన స్వరం. ఇంకా తీవ్రమైన అంశం ఏమిటంటే.. రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం కూడా జీవన్ రెడ్డి అభ్యంతరాలను పట్టించుకోకుండా, ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నట్టుగా కనిపించడం. ఇది పార్టీ లోపల 'అనుభవానికి విలువ లేదా అధికారానికి విలువా?' అనే మౌలిక ప్రశ్నను ముందుకు తెచ్చింది. దీని ఫలితంగా కాంగ్రెస్‌లో అనాదిగా ఉన్న జీవన్ రెడ్డిని పక్కన పెట్టి, కొత్తగా చేరిన ఎమ్మెల్యేకు ప్రాధాన్యం ఇచ్చే పరిస్థితి ఏర్పడిందన్న అభిప్రాయం కేడర్‌లో బలపడుతోంది.

ఈ నేపథ్యంలో సంజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం, స్థానికంగా తనదైన వర్గాన్ని నిర్మించుకోవడం.. మాజీ మంత్రి జీవన్ రెడ్డికి కంటగింపుగా మారింది. ఈ రాజకీయ ఘర్షణ కేవలం మాటల యుద్ధానికే పరిమితం కాలేదు. గతంలో జీవన్ రెడ్డి ప్రధాన అనుచరుడి హత్య, అందులో సంజయ్ కుమార్ అనుచరుడి పాత్ర ఉందన్న అనుమానాలు.. ఈ వివాదాన్ని మరింత తారస్థాయికి తీసుకెళ్లాయి. ఆ సందర్భంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి రోడ్డుపై



బైఠాయించి నిరసన వ్యక్తం చేయడం, రాష్ట్ర నాయకత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లడం.. ఈ విభేదాల తీవ్రతను స్పష్టంగా చూపాయి. ఇలాంటి నేపథ్యంతోనే ఇటీవల జీవన్ రెడ్డి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు, రాజకీయ విమర్శల హద్దులను దాటినవిగా మారాయి. ఇవి వ్యక్తిగత ఆవేదనకు ప్రతిబింబంగా కనిపించినా, ప్రజాస్వామ్య రాజకీయాల్లో భాషా సంయమనం ఎంత అవసరమో గుర్తు చేస్తున్నాయి. మరోవైపు సంజయ్ కుమార్ మాత్రం తాను కాంగ్రెస్‌లో చేరింది పూర్తిగా జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధి కోసమేనని, అధికార పార్టీగా ఉన్నప్పుడు అభివృద్ధి నిధులు తెచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నానని స్పష్టం చేస్తున్నారు. అయితే ఈ మొత్తం పరిణామాల్లో నష్టపోతున్నది ఎవరు అనే ప్రశ్నకు సమాధానం స్పష్టంగా కనిపిస్తోంది.. జగిత్యాల ప్రజలు. అభివృద్ధి, సంక్షమం, ఉపాధి వంటి అంశాలు వెనుకబడిపోతూ, నాయకుల మధ్య ఆధిపత్య పోరు ముందుకు వస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఇది ఒక హెచ్చరికగా భావించాలి. అధికారంలో ఉన్న వేళ అంతర్గత విభేదాలను పరిష్కరించుకోలేకపోతే, కేడర్‌లో గందరగోళం, ప్రజల్లో నిరాశ పెరిగే ప్రమాదం ఉంది. చివరికి ఇది జీవన్ రెడ్డిఉసంజయ్ కుమార్ మధ్య వ్యక్తిగత వివాదం మాత్రమే కాదు.. ఇది కాంగ్రెస్ పార్టీ రాజకీయ నైతికతకు, అనుభవానికి ఇచ్చే విలువకు, అధికార సమీకరణాలపై ఆధారపడే నిర్ణయాలకు మధ్య జరుగుతున్న పోరాటం. ఈ సంక్షభానికి పరిష్కారం రాష్ట్ర నాయకత్వం చేతుల్లోనే ఉంది. అనుభవాన్ని గౌరవిస్తూ, అధికారాన్ని సమన్వయపరిస్తూ, ప్రజా ప్రయోజనాన్ని కేంద్రంగా పెట్టిన రాజకీయ సంస్కృతి వైపు అడుగులు వేయగలిగితేనే.. జగిత్యాల రాజకీయాలు మళ్లీ అభివృద్ధి దిశగా మళ్లే అవకాశం ఉంటుంది.



## లంచగొండి ఎంపీడీవో

**రూ.1 లక్ష లంచం తీసుకుంటూ దొరికిన అధికారి**

రంగారెడ్డి, జనవరి 7 (ఈవార్తలు): రంగారెడ్డి జిల్లా నందిగామ ఎంపీడీవో కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. భవన నిర్మాణానికి సంబంధించి ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటుండగా ఎంపీడీవోను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నందిగామ మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామంలో బొబ్బిలి ప్రవీణ్ అనే వ్యక్తి చేపట్టిన భవన నిర్మాణానికి ఎంపీడీవో సుమతి, ఏపీవో తేజ్ సింగ్, ఈదులపల్లి కార్యదర్శి చెన్నయ్యలు రూ.3.5 లక్షల లంచం డిమాండ్ చేశారు. బాధితుడు ప్రవీణ్ గతంలో రూ.1 లక్ష చెల్లించాడు. మిగిలిన సొమ్ము కోసం అధికారులు తన నుంచి లంచం డిమాండ్ చేస్తున్నారని అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో ఈరోజు ఎంపీడీవో కార్యాలయంలో మరో రూ.1 లక్ష లంచం ఇస్తుండగా ముగ్గురినీ ఏసీబీ డీఎస్పీ పట్టుకున్నారు. ఈ ఘటనపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




## 'ఐబొమ్మ' రవి బెయిల్ పిటిషన్ కొట్టివేత

నాంపల్లి/హైదరాబాద్, జనవరి 7 (ఈవార్తలు): ఐబొమ్మ రవికి నాంపల్లి కోర్టులో చుక్కెదురైంది. బెయిల్ కోసం ఆయన దాఖలు చేసిన పిటిషన్ ను విచారించిన కోర్టు.. బెయిల్ ఇచ్చేందుకు నిరాకరిస్తూ పిటిషన్ ను తోసిపుచ్చింది. సినిమా పైరసీ వెబ్ సైట్ 'ఐబొమ్మ' వ్యవహారంలో సైట్ నిర్వాహకుడు ఇమంది రవిని అరెస్టు చేసిన పోలీసులు.. సైబర్ క్రైమ్ చట్టాల కింద ఐదు కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం జైలులో ఉన్న రవి బెయిల్ కోసం నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా రవిపై నమోదైన కేసులు ప్రస్తుతం విచారణ దశలో ఉన్నాయని పోలీసులు కోర్టుకు వెల్లడించారు. రవికి విదేశాల్లో పౌరసత్వం ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. బెయిల్ మంజూరు చేస్తే రవి విదేశాలకు పారిపోయే అవకాశం ఉందని తెలిపారు. దీంతో న్యాయస్థానం రవి బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది.

## మంత్రి ఉత్తమ్‌కు కీలక బాధ్యతలు

**తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఏఐసీసీ పరిశీలకుడిగా ఎంపిక**

హైదరాబాద్, జనవరి 7 (ఈవార్తలు): తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం కీలక బాధ్యతలు అప్పగించింది. ఈ సంవత్సరం తమిళనాడు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రాల్లో ఎన్నికలకు ఏఐసీసీ పరిశీలకుడిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి నియమితులయ్యారు. నాలుగు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల పర్యవేక్షణకు ఏఐసీసీ సీనియర్ పరిశీలకులను నియమించింది. అసోం, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అసోం ఎన్నికల పరిశీలకులుగా భూపేష్ భగేల్, డీకే శివకుమార్, బందు టిర్కి, కేరళకు సచిన్ పైలట్, కేజే జార్జ్, ఇమ్రాన్, కన్హయ్య కుమార్, తమిళనాడు, పుదుచ్చేరికి ముకుల్ వాస్నిక్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఖాజీ మహమ్మద్ నిజాముద్దీన్, పశ్చిమ బెంగాల్‌కు సుదీప్ రాయ్ బర్మన్, షకీల్ అహ్మద్ ఖాన్, ప్రకాశ్ జోషిలను నియమించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.



## పెళ్లికి ఒప్పుకోలేదని ప్రేమజంట ఆత్మహత్య

రంగారెడ్డి, జనవరి 7 (ఈవార్తలు): రంగారెడ్డి జిల్లా, యాచారం మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ప్రేమ వివాహానికి పెద్దలు అంగీకరించకపోవడంతో ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడింది. మంగళవారం ప్రియురాలు ఉరి వేసుకుని మరణించగా, బుధవారం ప్రియుడు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనతో రెండు కుటుంబాల్లోనూ తీవ్ర విషాదం నెలకొంది. మేడిపల్లి గ్రామానికి చెందిన మహేశ్ (20), ఓ బాలిక (16) గత నాలుగు నెలలుగా ప్రేమలో ఉన్నారు. బాలిక ఇబ్రహీంపట్నంలోని కార్తికేయ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అదే గ్రామానికి చెందిన మహేశ్‌తో ఆమె ప్రేమలో పడింది. ఈ విషయం ఇరు కుటుంబాలకు తెలియడంతో వారిద్దరినీ కొంతకాలం పాటు కలవకుండా చేశారు. పెద్దలు తమ ప్రేమను అంగీకరించి పెళ్లి చేయడం లేదని మనస్తాపానికి గురైన ఆ ప్రేమ జంట, గతంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. ఇద్దరూ తమ ఇళ్లలో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగారు. అయితే, ఇరువురు కూడా ప్రాణాపాయం నుండి సురక్షతంగా బయటపడ్డారు. తాజాగా, సోమవారం మహేశ్ బాలికకు ఫోన్ చేసి తనను పెళ్లి చేసుకోవాలని, లేదంటే ఆత్మహత్య చేసుకుంటానని చెప్పాడు. దీంతో మనోవేదనకు గురైన బాలిక మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె మరణించిన విషయం తెలుసుకున్న మహేశ్, బుధవారం పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని మృతి చెందాడు.

## కేటీఆర్ ర్యాలీలో జగన్ జెండాలు

**ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో కేటీఆర్ ర్యాలీ.. ర్యాలీలో పాల్గొన్న వైసీపీ అభిమానులు, కార్యకర్తలు**

ఖమ్మం, జనవరి 7 (ఈవార్తలు): తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన పర్యటనలో భాగంగా ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని నాయకన్‌గూడెంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అనూహ్యంగా ఏపీ మాజీ సీఎం జగన్ ఫొటోలు, వైసీపీ జెండాలు కనిపించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. వైసీపీ కార్యకర్తలు, అభిమానులు కూడా ఈ ర్యాలీలో పాల్గొని జై జగన్, జై కేటీఆర్ అంటూ నినాదాలు చేశారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతున్నాయి. రెండు పార్టీల మధ్య స్నేహబంధాన్ని మరోసారి గుర్తు చేస్తున్నాయి. బీఆర్ఎస్, వైసీపీ పార్టీల మధ్య ముందు నుంచి మంచి సంబంధాలు ఉన్నాయి. తెలంగాణలో బీఆర్ఎస్, ఏపీలో వైసీపీ అధికారంలో



ఉన్నప్పుడు కూడా కేసీఆర్, జగన్ మధ్య స్నేహపూర్వక వాతావరణం కొనసాగింది. రాజకీయ విషయాల్లో ఒకరికొకరు మద్దతు తెలుపుకునేవారు. ఇటీవల జగన్ పుట్టినరోజు సందర్భంగా తాడేపల్లిలో జగన్ నివాసం వద్ద కేసీఆర్, కేటీఆర్, జగన్ ఫ్లెక్సీలు వెలిశాయి. ఈ సందర్భంగా రెండు పార్టీల సాన్నిహిత్యం మరోసారి బయటపడింది.

## శంభాజీనగర్‌లో మసీదు కూల్చివేతపై ఒవైసీ ఆగ్రహం



న్యూఢిల్లీ: మహారాష్ట్రలోని శంభాజీనగర్‌లో వక్ఫ్ భూమిలో ఉన్న మసీదు కూల్చివేతపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా స్పందించారు. అలాగే ఢిల్లీలోని తుర్క్‌మాన్ గేట్ దగ్గర ఫైజ్-ఎ-ఇలాహి మసీదు సమీపంలో జరిగిన కూల్చివేతలను కూడా ఆయన ఖండించారు. ఆ భూమి పూర్తిగా వక్ఫ్ బోర్డుదే అని స్పష్టం చేశారు. ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న 'సేవ్ ఇండియా ఫౌండేషన్ల పిటిషన్‌పై నవంబర్ 12న ఢిల్లీ హైకోర్టు తీర్పు ఇచ్చిందని, కానీ కోర్టు ఆదేశించిన సర్వేలో వక్ఫ్ బోర్డును ఒక పార్టీగా చేర్చకపోవడం ఆశ్చర్యకరమని ఒవైసీ అన్నారు. ఢిల్లీ వక్ఫ్ బోర్డు ఈ కేసులో జోక్యం చేసుకుని, వక్ఫ్ గెజిట్ నోటిఫికేషన్‌ను కోర్టుకు సమర్పించాల్సిందని సూచించారు. రివ్యూ పిటిషన్ వేయకపోవడంతో కోర్టు తప్పుడు నిర్ణయం తీసుకుందని, దీంతో వక్ఫ్ ఆస్తికి నష్టం జరిగిందని విమర్శించారు. 1947లో అది మసీదుగా ఉండేదని గుర్తుచేసిన ఒవైసీ... వక్ఫ్ బోర్డు, మసీదు నిర్వహణ కమిటీ వెంటనే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని, వాస్తవాలు వివరించి స్టేటస్ కో తెచ్చుకోవాలని సలహా ఇచ్చారు. అంతేకాకుండా, ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్‌లకు ఇన్ని రోజులైనా బెయిల్ ఇవ్వకపోవడంపై కూడా ఒవైసీ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

## థనే జిల్లాలో బీజేపీతో కాంగ్రెస్ జత

**శివసేనకు మేయర్ పదవి రాకుండా పావులు**

**సొంత పార్టీ నేతలపై వేటు వేసిన కాంగ్రెస్**

**పొత్తు ఆమోదయోగ్యం కాదన్న ఫడ్నవీస్**

థనే: మహారాష్ట్ర రాజకీయాల్లో ఓ అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. "కాంగ్రెస్ ముక్త్ భారతు అని నినదించే బీజేపీ.. స్థానిక సంస్థలో అధికారం కోసం అదే కాంగ్రెస్‌తో చేతులు కలిపింది. థనే జిల్లాలోని అంబర్‌నాథ్ మున్సిపల్ కౌన్సిల్‌లో ఈ వింత పొత్తు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. మిత్రపక్షమైన శివసేన (షిండే వర్గం)ను అధికారానికి దూరం పెట్టేందుకే బీజేపీ ఈ ఎత్తుగడ వేయడం గమనార్హం. అంబర్‌నాథ్ మున్సిపాలిటీలో "అంబర్‌నాథ్ వికాస్ ఆఘాడీ" పేరుతో బీజేపీ, కాంగ్రెస్, ఎన్సీపీ (అజిత్ పవార్ వర్గం) కూటమిగా ఏర్పడ్డాయి. ఈ కూటమిలో 14 మంది బీజేపీ, 12 మంది కాంగ్రెస్, నలుగురు ఎన్సీపీ కౌన్సిలర్లతో పాటు ఒక స్వతంత్ర సభ్యుడు ఉన్నారు. దీంతో అతిపెద్ద పార్టీగా అవతరించిన శివసేన (షిండే వర్గం) ప్రతిపక్షనికే పరిమితమైంది. ఈ కూటమి మద్దతుతో బీజేపీ నేత తేజశ్రీ కరాంజులే మేయర్ గా ఎన్నికయ్యారు. అయితే స్థానిక నేతల నిర్ణయంపై బీజేపీ, కాంగ్రెస్ అధిష్ఠానాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ పొత్తు ఆమోదయోగ్యం కాదని, దీనిని వెంటనే రద్దు చేయాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఆదేశించారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మరోవైపు, మహారాష్ట్ర కాంగ్రెస్ కూడా ఈ పొత్తును తీవ్రంగా వ్యతిరేకించింది. పార్టీ ఆదేశాలను ధిక్కరించినందుకు అంబర్‌నాథ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రదీప్ పాటిల్‌తో పాటు పొత్తుకు మద్దతిచ్చిన 12 మంది కార్పొరేటర్లను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. ఈ పరిణామం మహాయుతి కూటమిలోనూ చిచ్చు రేపింది. అధికారం కోసం బీజేపీ సిద్ధాంతాలను పక్కనపెట్టిందని శివసేన (షిండే వర్గం) నేతలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. స్థానిక బీజేపీ నేతలు మాత్రం.. శివసేన హయాంలో అవినీతి పెరిగిందని, అందుకే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని సమర్థించుకుంటున్నారు. మొత్తం మీద, అధికారం కోసం ఏర్పడిన ఈ పొత్తు.. ఇప్పుడు రెండు పార్టీల అధిష్ఠానాల ఆదేశాలతో రద్దయ్యే పరిస్థితికి చేరింది.

## 24 గంటల్లో 28.95 కిలోమీటర్ల బీటీ రోడ్డు

**ఏపీలో ఎన్‌హెచ్ఏఐ రెండు గిన్నిస్ రికార్డులు**

**విజయవాడ-బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌వేఅబశ్రీశ్రీపై ఘనత**

బెంగళూరు: బెంగళూరు-కడప-విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణంలో భాగంగా ఏపీలో భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులను సృష్టించింది. ఇది భారత్‌కు, ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమని సీఎం చంద్రబాబు తెలిపారు. "బెంగళూరు-కడప-విజయవాడ ఎకనామిక్ కారిడార్ లో రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా ఎన్‌హెచ్ఏఐ 24 గంటల్లోనే 28.95 లేన్-కిలోమీటర్ల పొడవున, 10,675 మెట్రిక్ టన్నుల తారు కాంక్రీట్‌ను నిరంతరాయంగా వేసి రెండు గిన్నిస్ రికార్డులను నెలకొల్పింది" అని సీఎం చంద్రబాబు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. కేంద్ర ప్రభుత్వ దార్శనికత, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నాయకత్వంలో ప్రపంచస్థాయి రహదారుల నిర్మాణం, ఇంజినీర్లు, కార్మికుల అసాధారణ నిబద్ధత వల్లే ఈ ఘనత సాధ్యమైందని ఆయన కొనియాడారు. ఇదే కారిడార్‌లోని ఇతర ప్యాకేజీలలో 2026 జనవరి 11 నాటికి మరో రెండు గిన్నిస్ రికార్డుల కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని, వారికి శుభాకాంక్షలు తెలుపుతున్నానని చంద్రబాబు పేర్కొన్నారు. భారత్‌మాల ఫేజ్-×× కింద చేపట్టిన ఈ ఆరు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం ఇటీవల వేగం పుంజుకుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నుంచి బెంగళూరుకు ప్రయాణ సమయం ప్రస్తుతం ఉన్న 11-12 గంటల నుంచి సుమారు 6 గంటలకు తగ్గనుంది. ఈ రహదారి ఏపీలోని గుంటూరు, ప్రకాశం, కర్నూలు, కడప జిల్లాల మీదుగా కర్ణాటకలోకి ప్రవేశిస్తుంది. మొత్తం 518 నుంచి 624 కిలోమీటర్ల పొడవున్న ఈ రహదారిని సుమారు రూ.19,200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. ఇందులో కోడికొండ నుంచి అద్దంకి/ముప్పవరం వరకు 342 కిలోమీటర్ల భాగం పూర్తిగా గ్రీన్‌ఫీల్డ్ కాగా, మిగిలిన భాగాన్ని బ్రౌన్‌ఫీల్డ్ పద్ధతిలో అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ఏపీ కనెక్టివిటీకి, సరుకు రవాణాకు కీలకం కానుంది.

## సింగపూర్ సైనిక శిక్షణకు లాలూ మనవడు

పాట్నా: బీహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ మనవడు ఆదిత్య సింగపూర్ లో సైనిక శిక్షణకు వెళుతున్నాడు. రెండేళ్ల పాటు ఆయుధ శిక్షణతో పాటు యుద్ధ సన్నద్ధతకు సంబంధించిన ట్రైనింగ్ పొందనున్నాడు. ఈ విషయాన్ని ఆదిత్య తల్లి, లాలూ ప్రసాద్ యాదవ్ కూతురు రోహిణి ఆచార్య ఎక్స్ లో వెల్లడించారు. రోహిణి ఆచార్య కుటుంబం సింగపూర్ లో స్థిరపడిన విషయం తెలిసిందే. రోహిణితో పాటు ఆమె కుటుంబంలో అందరికీ భారత పౌరసత్వమే ఉంది. అయితే, వారంతా సింగపూర్ లో పర్మనెంట్ రెసిడెన్సీ స్టేటస్ పొందారు. సింగపూర్ చట్టాల ప్రకారం.. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు రెండేళ్ల పాటు సైనిక శిక్షణ పొందాల్సి ఉంటుంది. సింగపూర్ పౌరులతో పాటు సింగపూర్ పర్మనెంట్ రెసిడెన్సీ పొందిన రెండో తరం పౌరులకు ఈ నిబంధన వర్తిస్తుంది. ఆదిత్యకు ఇటీవలే 18 సంవత్సరాలు నిండడంతో సైనిక శిక్షణకు హాజరవుతున్నాడు. రెండేళ్ల పాటు సాగే ఈ శిక్షణలో ఫిజికల్ ట్రైనింగ్ తో పాటు వివిధ ఆయుధాల వినియోగంపై ప్రాథమిక శిక్షణ అందిస్తారు.

# 21 ఏళ్లకే క్యాన్సర్

**యువకుడి నరక యాతన.. మొక్కవోని దీక్షతో పోరాటం**

**ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే.. అండగా నిలవాలని వేడుకోలు**



శ్రీకాకుళం, జనవరి 7 (ఈవార్తలు): శ్రీకాకుళం జిల్లా జీ సిగడాం మండలం డీఆర్ వలస గ్రామానికి చెందిన 21ఏళ్ల కుమరాపు గోపీచంద్ క్యాన్సర్ తో బాధ పడుతున్నారు. పేద మధ్యతరగతి కుటుంబానికి చెందిన చందును తల్లిదండ్రులు వైజాగ్ లోని మహాత్మా గాంధీ క్యాన్సర్ హస్పిటల్, మెరుగైన వైద్యం కోసం మెడికవర్ క్యాన్సర్ ఆస్పత్రికి తరలించారు. వాళ్ల నాన్న ఆటో నడుపుతూ కుటుంబ పోషణ చేసుకుంటున్నారు. ఆర్థిక స్థోమత కూడా అంతంత మాత్రానే కావడంతో తోచినకాడికి అప్పులు చేసి వైద్యం చేపించుకుంటున్నారు. ఇప్పటికే గ్రామస్థులు, కుటుంబ సభ్యులు సహా స్నేహితులు శ్రేయోభిలాషులు కొంత ఆర్థిక సాయం చేస్తున్నారు. దాదాపు 50 లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పారని వారు తెలిపారు. ఎంతో కొంత తోచిన సాయం చేయాలని వేడుకుంటున్నారు.




# నుమాయిష్‌లో ఉచిత చికిత్స!

**సెయింట్ జాన్ అంబులెన్స్ ఉదారత**

నాంపల్లి, హైదరాబాద్, జనవరి 7 (ఈవార్తలు): నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న 85వ ఆలిండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ జరిగే అన్ని రోజుల్లో ఉచితంగా ప్రాథమిక చికిత్స అందించనున్నట్లు సెయింట్ జాన్ అంబులెన్స్ (ఇండియా) తెలిపింది. ఎగ్జిబిషన్‌కు వచ్చే సందర్శకుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రాథమిక చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేశామని డైరెక్టర్ వీవీవీఎస్ మూర్తి తెలిపారు. సెక్రటరీ డాక్టర్ ఎం మహేంద్ర కుమార్ తెలిపారు.



# ఎంఐఎంను బలోపేతం చేయాలి

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు హుస్సేన్**

**జగిత్యాల జిల్లా, టౌన్ కార్యవర్గాల ఎన్నిక**

జగిత్యాల, జనవరి 7: ఎంఐఎం బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. బుధవారం పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన జగిత్యాల జిల్లా, పట్టణ నూతన కార్యవర్గాలను ప్రకటించారు. ఈ సందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ ఎంఐఎం అధినేత, హైద్రాబాద్ ఎంపి అసదోద్దీన్ ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా, పట్టణ కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని తెలిపారు. జిల్లా అధ్యక్షనిగా ఖాజా లియాఖత్ అలీ మోసీన్, కార్యదర్శిగా మహమ్మద్ రజీ ఉద్దీన్, పట్టణ అధ్యక్షనిగా సుమేరోద్దీన్, కార్యదర్శిగా ఖాజా అమీరోద్దీన్లను ఎన్నుకున్నామని తెలిపారు. జగిత్యాల జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల నియోజకవర్గాల్లో ఎంఐఎం పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు ఎంఐఎం బలోపేతానికి సమన్వయంతో పని చేయాలని సూచించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ అభ్యర్థుల గెలుపుకు ప్రతి ఒక్కరు కలసి పని చేయాలన్నారు. నూతన కార్యవర్గాన్ని ఆయన అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కోర్టుకు ఏపీ లిక్కర్ స్కామ్ ఎఫ్ఎస్ఎల్ నివేదిక

అమరావతి, జనవరి 7 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను కుదిపేస్తున్న లిక్కర్ స్కామ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో నిందితుల మొబైల్ ఫోన్ల నుంచి సేకరించిన డిజిటల్ ఆధారాలపై ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నివేదిక కోర్టుకు చేరింది. ఈ నివేదికను సిట్ అధికారులు తీసుకునే అవకాశం ఉంది. స్కామ్ బయటపడిన వెంటనే చాలా మంది నిందితులు తమ మొబైల్ ఫోన్లను ధ్వంసం చేశారని, రీసెట్ చేశారని ఆరోపణలు ఉన్నాయి. అయినా ఆధునిక ఫోరెన్సిక్ సాంకేతికతతో డిలీట్ అయిన డేటా, కాల్ రికార్డులు, చాట్స్, ఫైల్స్‌ను రికవరీ చేసినట్టు సమాచారం. ఈ రికవరీ డేటాలో ఏం ఉందో తెలిస్తే కేసు మరింత లోతుగా సాగే అవకాశం ఉంది. ఈ రిపోర్ట్ సిట్ చేతికి అందితే... ఆర్థిక లావాదేవీలు, రాజకీయ నాయకులతో సంబంధాలు, లంచాలకు సంబంధించిన ఆధారాలు వెలుగులోకి రావచ్చు. దీంతో ఇప్పటికే నిందితులుగా ఉన్నవారితో పాటు మరికొందరి పెద్ద పేర్లు కూడా వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నివేదికలో ఏం బయటపడుతుందోనని రాజకీయ నాయకులు, అధికారులు ఆందోళన చెందుతున్నారు.

# రాజకీయాల నుంచి తప్పుకుంటున్నా

**కామినేని శ్రీనివాసరావు కీలక ప్రకటన**

కైకలూరు, జనవరి 7 (ఈవార్తలు): ఏపీ బీజేపీ సీనియర్ నేత, కైకలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు సంచలన ప్రకటన చేశారు. వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని ఆయన ప్రకటించారు. రాజకీయాల నుంచి తప్పుకోవాలని ఎప్పుడో అనుకున్నానని, కానీ అందరూ కోరుకోవడంతో పాటు బలవంతం చేయడంతోనే 2024 ఎన్నికల్లో పోటీ చేశానని ఆయన అన్నారు. అనూహ్యంగా ఎవరూ ఊహించని విధంగా భారీ మెజారిటీతో విజయం సాధించానని చెప్పారు. తాను కానీ, తన కుటుంబంలో, ఎవరూ కానీ ఇకపై ఎన్నికల్లో పోటీ చేయబోమని కామినేని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా మంచి పనులు చేసి, సమాజానికి ఉపయోగపడేలా పేరు తెచ్చుకుంటానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇదే సమయంలో... నియోజకవర్గంలో అక్రమాలు, అన్యాయాలు జరిగితే ఎవరినీ ఉపేక్షించబోమని కఠిన హెచ్చరిక కూడా చేశారు. ఎవరైనా తప్పు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. మరోవైపు, సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలకు కామినేని శ్రీనివాసరావు మంచి సందేశం ఇచ్చారు. పండుగలో జూదాలు ఆడటం మానేసి, మన సంప్రదాయ క్రీడలే ఆడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. 'జూదాలు వద్దు ఉ సంప్రదాయ క్రీడలే ముద్దు' అనే నినాదం కూడా ఇచ్చారు.



# కొండగట్టు అంజన్నకు రూ.1.79 కోట్లు

**84 రోజుల హుండీ లెక్కింపు**

మల్యాల, జనవరి 7 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేటలో ఉన్న కొండగట్టు ఆలయానికి హుండీ లెక్కింపు ద్వారా రూ.01,79,35,866 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీకాంతారావు తెలిపారు. 84 రోజులకు సంబంధించి ఆలయంలోని 13 హుండీల లెక్కింపు జరుపగా ఈ ఆదాయం వచ్చిందన్నారు. మిశ్రమ వెండి, బంగారం సీల్ చేసి హుండీలో భద్రపరిచామని వివరించారు. 130 విదేశి కరెన్సీ వచ్చాయని వివరించారు. జగిత్యాల దేవాదాయ శాఖ పరిశీలకులు రాజమోగిలి పర్యవేక్షణలో ఆలయ ఏఈవో గుండి హరిహరనాథ్, ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణ, రఘు, ఆలయ సిబ్బంది, ఏఎస్సై, పోలీసు, సెక్యూరిటీ, బ్యాంక్ సిబ్బంది సమక్షంలో హుండీ లెక్కింపు జరిగిందని పేర్కొన్నారు.



# గడ్డి మందును దూరం పెట్టండి

**రైతులకు డాక్టర్ మర్రి మహేశ్ రెడ్డి సూచన**

మల్యాల, జనవరి 7 (ఈవార్తలు): రైతులు గడ్డి మందులను తగ్గిస్తేనే రైతుల ఆరోగ్యంతో పాటు భూసారానికి మేలని కరీంనగర్ వన్ హాస్పిటల్ వైద్యుడు మహేశ్ రెడ్డి అన్నారు. అధికంగా గడ్డి పురుగు మందుల వాడటం వల్ల వాటి దుష్ప్రభావాలతో రైతుల ఆరోగ్యం పాడవడమే కాకుండా, భూసారంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని చెప్పారు. బుధవారం మల్యాల మండలం ముత్యంపేటలో రైతులకు ప్యారాకట్ గడ్డి మందు వాడకంపై అవగాహన కల్పించారు. రైతుల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గడ్డి మందుల వినియోగానికి బదులు ప్రత్యామ్నాయ పద్ధతులు అవలంబించడమే ఉత్తమ మార్గమని సూచించారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, ఉద్యమన శాఖ అధికారి శ్యాం ప్రసాద్, జగిత్యాల జిల్లా డీఎస్పీ రఘు చందర్, మల్యాల సీఐ రవి, ఎస్సై నరేశ్ కుమార్, మండల వ్యవసాయ అధికారి చంద్ర దీపక్, స్థానిక సర్పంచ్ దారం ఆదిరెడ్డి, ఉప సర్పంచ్ కందరి ముత్యంరెడ్డి, వార్డు సభ్యులు ముత్యంపేట గ్రామ వీడీసీ అధ్యక్షుడు సామ మైపాల్ రెడ్డి, ముత్యంపేట మాజీ సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, మ్యాక లక్ష్మణ్, నల్ల నరసింహారెడ్డి పాల్గొన్నారు.



# సముద్రపు నీటినే వాడుకుంటున్నాం

**తెలంగాణతో నీటి వివాదాలపై చంద్రబాబు వ్యాఖ్యలు**

అమరావతి, జనవరి 7 (ఈవార్తలు): ఏపీ సీఎం చంద్రబాబు బుధవారం పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడుతూ తెలంగాణతో నీటి వివాదాలపై సున్నితంగా, స్పష్టంగా స్పందించారు. గోదావరి నదిలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయని, సముద్రంలోకి పోతున్న నీటిని ఎవరైనా వాడుకోవచ్చని చంద్రబాబు అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు అభ్యంతరం చెప్పడం సరికాదని, నీటి విషయంలో రాజకీయాలు చేయొద్దని తెలంగాణను కోరారు. "తెలుగు జాతి ఒక్కటే... ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉండాలి. రెండు రాష్ట్రాల మధ్య విరోధాలు పెంచుకుని ఇతరులు ఆనందించే పరిస్థితి రావొద్దు" అని హితవు పలికారు. కొందరు మాట్లాడుతున్న మాటలు వింటుంటే... ఆ రాజకీయాలేమిటో తనకే అర్థం కావడం లేదని చంద్రబాబు అన్నారు. గోదావరి నది పైభాగంలో దేవాదుల ఉందని... దేవాదుల నుంచి నీళ్లు వస్తే కింద ఉన్న పోలవరానికే వస్తాయని, కిందికి వచ్చే నీళ్లకు అభ్యంతరం చెబితే అర్థమేమీ ఉండదని అన్నారు. తాము ఎప్పుడూ దేవాదులకు వ్యతిరేకం కాదని, తెలంగాణ కాళేశ్వరం ప్రాజెక్టు కడుతున్నప్పుడు కూడా అభ్యంతరం చెప్పలేదని గుర్తు చేశారు. నీళ్ల పొదుపు చేస్తే తెలంగాణకూ లాభమేనని, మిగులు నీటిని శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో నిల్వ చేసుకోవచ్చని సూచించారు. కృష్ణా నదిలో నీళ్లు తక్కువగా ఉండటంతో పైన ప్రాజెక్టులు కడితే నష్టమని, కానీ గోదావరి డెల్టాను కాపాడుకుని కృష్ణా–గోదావరి అనుసంధానం చేస్తే ఇబ్బంది ఉండదని అన్నారు. రాయలసీమ ఎత్తిపోతలపై కొందరు చేస్తున్న వ్యాఖ్యల్లో అర్థం లేదని, అబద్ధాలను వందసార్లు చెబితే నిజమవుతుందని అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పోలవరం ఆలస్యంపై గత వైసీపీ ప్రభుత్వాన్ని చంద్రబాబు విమర్శించారు. గత ప్రభుత్వం వల్లే 6–7 ఏళ్లు ఆలస్యమైందని, డయాఫ్రం వాల్ పాడైందని ఐఐటీ హైదరాబాద్ నిపుణులు చెప్పిన తర్వాతే వాళ్లకు తెలిసిందని విమర్శించారు. ఇప్పుడు కొత్తగా డయాఫ్రం వాల్ కడుతున్నామని, ఫిబ్రవరి 15లోపు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ అక్రమాలపై దర్యాప్తు



జరుగుతోందని, కానీ దర్యాప్తు పేరుతో కాలయాపన చేసుకుంటూ పోతే, పనులు పూర్తి చేయడానికి చాలా కాలం పడుతుందని చెప్పారు. అనుమతులు లేని ప్రాజెక్టులకు రూ. 2 వేల కోట్లు ఖర్చు పెట్టారని... ఎన్జీటీకి రూ. 100 కోట్ల జరిమానా కట్టారని దుయ్యబట్టారు.




# సంక్రాంతి వేళ 8 వేలకు స్పెషల్ బస్సులు


**: ఏపీఎస్ఆర్టీసీ**

హైదరాబాద్, విజయవాడ, జనవరి 7 (ఈవార్తలు): సంక్రాంతి పండుగను స్వగ్రామాల్లో ఘనంగా జరుపుకునే రాష్ట్ర ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) మొత్తం 8,432 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ప్రకటించింది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న తెలుగువారి సౌకర్యార్థం ఈ బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి ప్రధాన నగరాలకు 2,432 ప్రత్యేక బస్సులు నడపనుండగా, మిగిలిన బస్సులను రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు నడపనున్నట్లు వెల్లడించింది. ఇక్కడ మరో విశేషం ఏమిటంటే, ఈ ప్రత్యేక బస్సుల్లో కూడా సాధారణ ఛార్జీలనే వసూలు చేయనున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ స్పష్టం చేసింది. తెలుగువారి అతి పెద్ద పండుగ సంక్రాంతి. తెలుగు రాష్ట్రాల్లో పండుగను మూడు రోజుల పాటు భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ఘనంగా జరుపుకుంటారు. గ్రామాలు, పట్టణాలు, నగరాలు పండుగ శోభతో ముస్తాబవుతాయి. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపారాలతో స్థిరపడిన తెలుగువారు ఈ పండుగకు ప్రత్యేకంగా స్వగ్రామాలకు తరలివచ్చి కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. వీరి కోసమే ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది.

# ఏపీలో టాటా 6,675 కోట్ల పెట్టుబడి

**నెల్లూరులో సోలార్ పవర్ యూనిట్**

నెల్లూరు, జనవరి 7 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌కు మరో భారీ పెట్టుబడి తరలివచ్చింది. ప్రముఖ టాటా గ్రూప్‌కు చెందిన టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్, రాష్ట్రంలో భారీ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. నెల్లూరులో రూ. 6,675 కోట్ల పెట్టుబడితో 10 గిగావాట్ల సామర్థ్యం గల ఇంగాట్, వేఫర్ తయారీ కేంద్రాన్ని నెలకొల్పనుంది. దేశంలోనే ఇది అతిపెద్ద ఇంగాట్, వేఫర్ తయారీ కేంద్రం కానుండటం విశేషం. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో ఈ ప్రాజెక్టుకు ఆమోదం లభించింది. ఇఫ్కో కిసాన్ స్పెషల్ ఎకనామిక్ జోన్‌లో ఈ ఫ్యాక్టరీని నిర్మించనున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 200 ఎకరాల భూమిని కేటాయించింది. తొలిదశలో 120 ఎకరాలు, భవిష్యత్



విస్తరణ కోసం మరో 80 ఎకరాలు ఉపయోగించనున్నారు. సోలార్ సెల్స్, మాడ్యూల్స్, సెమీకండక్టర్ల తయారీలో ఇంగాట్లు, వేఫర్లు అత్యంత కీలకమైనవి. ఈ ప్రాజెక్టు ద్వారా దేశీయంగా వీటి ఉత్పత్తి పెరిగి, దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుంది. ఈ ఫ్యాక్టరీ ద్వారా ప్రత్యక్షంగా సుమారు 1,000 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఫ్యాక్టరీకి అవసరమైన విద్యుత్‌ను అందించేందుకు 200 మెగావాట్ల గ్రీన్ పవర్ ప్లాంట్‌ను కూడా టీపీఆర్ఈఎల్ ఏర్పాటు చేయనుంది. ఈ భారీ పెట్టుబడిపై రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. "ఆంధ్రప్రదేశ్‌లో టాటా గ్రూప్ మరో చారిత్రక పెట్టుబడి పెట్టడం గర్వంగా ఉంది. మా ప్రభుత్వ పాలనా స్థిరత్వం, మౌలిక వసతులు, స్వచ్ఛ ఇంధన తయారీకి ఇస్తున్న ప్రాధాన్యతపై ఉన్న విశ్వాసానికి ఇది నిదర్శనం. ఈ ప్రాజెక్టు ద్వారా నాణ్యమైన ఉద్యోగాలు లభిస్తాయి" అని ఆయన అన్నారు. రాష్ట్రంలో సిద్ధంగా ఉన్న పారిశ్రామిక భూములు, బలమైన మౌలిక వసతులు, పోర్టు కనెక్టివిటీ వంటి అంశాలు ఈ పెట్టుబడిని ఆకర్షించడంలో కీలకపాత్ర పోషించాయి. ఈ ప్రాజెక్టుతో నెల్లూరు ప్రాంతం సోలార్ తయారీ హబ్‌గా మరింత అభివృద్ధి చెందనుంది.

# భగవద్గీతే నిజమైన విద్యకు పునాది

**ఎస్సెస్సీ విద్యార్థులకు దేవనాథ జీయర్ స్వామీజీ బోధ**

జగిత్యాల టౌన్, జనవరి 7 (ఈవార్తలు): భగవద్గీతే నిజమైన విద్యకు పునాది అని దేవనాథ జీయర్ స్వామీజీ అన్నారు. బుధవారం జగిత్యాలలోని సిద్ధార్థ విద్యాసంస్థ ఆధ్వర్యంలో మానస ఎక్సలెన్స్ స్కూల్‌లో నిర్వహించిన ఎగ్జామ్ చాలెంజెస్–మోటివేషన్ సెషన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన.. పిల్లలకు భారతీయ సంస్కృతి, సంప్రదాయ విలువలు తప్పనిసరిగా నేర్పాలని అన్నారు. విద్యకు ఫుల్‌స్టాప్ ఉండదని, ప్రతి వ్యక్తి జీవితాంతం విద్యార్థిగానే ఉండాలని అన్నారు. నేటి విద్యావిధానం డబ్బు సంపాదించి సెటిల్ అవ్వడానికే పరిమితం అయిపోతోందని, విద్య అసలు ఉద్దేశం అది కాదని హితవు పలికారు. ప్రస్తుత చదువు విద్యార్థిని వ్యక్తిత్వంతో కూడిన వ్యక్తిగా నిలబెట్టడం లేదని, అందులో విలువలు, సంస్కారం లోపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 1940ల్లో భారతీయులను బానిసలుగా మార్చే ఉద్దేశంతో మెకాలే రూపొందించిన విద్యావిధానం ఇప్పటికీ ప్రభావం చూపుతోందని, అయితే దాన్ని మార్చేందుకు ప్రధాని మోదీ ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. మనం ఎంత సంపాదించాలనే దానికోసమే చదువుతున్నామని, ప్రపంచానికి విజ్ఞానం అందిస్తున్నామనుకుంటూ మనమే చీకట్లో ఉన్నామని అన్నారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా భగవద్గీతను అధ్యయనం చేయాలని, దాని ద్వారా క్రమశిక్షణ, ఒత్తిడి నుంచి ఉపశమనం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రజ్ఞా వికాస్ కో ఆర్డినేటర్ ట్రస్మా జిల్లా అధ్యక్షుడు యాదగిరి శేఖర్, పాఠశాల నిర్వాహకులు శ్రీధర్ రావు, హరిచరణ్ రావు, రజిత రావు, మౌనికరావు, సుమన్ రావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## అనేక సవాళ్లతో వృద్ధాప్యం

వృద్ధాప్యంలో ఉన్న వారు తమ రోజువారీ జీవనానికి అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నారు. డైమెన్షియా, అల్జీమర్స్ వంటి మానసిక ఆరోగ్య సమస్యల బారిన పడుతున్నారు. సామాజిక భద్రత సరిపడా లేకపోవడం, జీవనవ్యయం, వైద్య ఖర్చులు పెరగడం, ఆర్థిక వనరులు పరిమితంగా ఉండటం వంటి సమస్యలు అదనంగా ఉంటున్నాయి. కుటుంబ సహకార వ్యవస్థలు బలహీనపడుతుండటం, సామాజిక ఒంటరితనం, నిర్లక్ష్యం, తోడు లేకపోవడంతో వృద్ధుల జీవితాలు మరింత ఇబ్బందికరంగా మారుతున్నాయి. కొత్త సాంకేతికతను వినియోగించడంలో అడ్డంకులు, పరికరాలు అందుబాటులో లేకపోవడం, వినియోగించుకోవడం తెలియకపోవడం, బహిరంగ ప్రదేశాలు, రవాణాలో వృద్ధులకు ర్యాంపులు, హ్యాండ్‌రైల్స్ వంటివి లేకపోవడం కూడా వారి నిత్యజీవితానికి అడ్డంకిగా మారుతున్నాయి.







# ఊతకర్రకు కేంద్రం ఊతం

*గౌరవప్రద వృద్ధాప్యానికి తోడుగా కేంద్రం*

*వృద్ధుల సంక్షమానికి పలు పథకాలు*

*సాంకేతికతతో సీనియర్ సిటిజన్లకు సేవలు*

**వయో వృద్ధులకు ఆసరాగా మోదీ సర్కారు.. 2036కి దేశంలో 23 కోట్లకు వృద్ధుల జనాభా**

### దక్షణాది రాష్ట్రాల్లో అధికంగా వృద్ధులు.. వయస్సుతో పాటు పెరుగుతున్న సమస్యలు

న్యూఢిల్లీ: భారత్‌లో వృద్ధుల జనాభా వేగంగా పెరుగుతోంది. ముఖ్యంగా దక్షణాది రాష్ట్రాల్లో వృద్ధుల జనాభా గణనీయంగా పెరుగుతోంది. టెక్నికల్ గ్రూప్ ఆన్ పాపులేషన్ ప్రొజెక్షన్స్(టీజీపీపీ) 2020 జూలైలో ఇచ్చిన 'పాపులేషన్ ప్రొజెక్షన్ రిపోర్ట్' ప్రకారం.. భారత్‌లో 60 ఏళ్లు దాటిన వృద్ధుల సంఖ్య 2011లో 10 కోట్లు ఉండగా 2036 నాటికి 23 కోట్లకు చేరుతుందని అంచనా.

2036 కల్లా ప్రతి ఏడుగురు భారతీయుల్లో ఒకరు 60 ఏళ్లు, ఆపై వయస్సు ఉంటారని ఈ నివేదిక పేర్కొన్నది. దక్షణాది రాష్ట్రాలతో పాటు హిమాచల్ ప్రదేశ్, పంజాబ్‌లో వృద్ధుల జనాభా ఎక్కువగా పెరుగుతోంది. ఉత్తరాది, తూర్పు రాష్ట్రాల్లో వృద్ధుల జనాభా తక్కువగా ఉన్నప్పటికీ వేగంగానే పెరుగుతోంది.

తెలంగాణలో 2011లో 60 ఏళ్లు పైబడిన వారి జనాభా 32,29,000(9.2%) ఉండగా, 2026 కల్లా 48,24,000(12.5%), 2036 నాటికి 67,50,000(17.1%)కి పెరుగుతుందని అంచనా. మెరుగైన పోషకాహారం, వైద్యసేవలు భారత్‌లో ప్రజల ఆయుర్దాయం పెరిగేందుకు సహాయపడ్డాయి. ఇదే సమయంలో పెరుగుతున్న వృద్ధుల జనాభా కొత్త సవాళ్లు, అవకాశాలను తీసుకొస్తోంది.

## అటల్ పెన్షన్ యోజన

దేశంలో పేద, వెనుకబడిన ప్రజలకు సామాజిక భద్రత కల్పించే లక్ష్యంతో కేంద్రం 2015 మే 9న ఈ పథకాన్ని ప్రారంభించింది. 18-40 ఏళ్ల మధ్య వయస్సువారు ఈ పథకంలో చేరవచ్చు. 60 ఏళ్లు రాగానే చందాదారులకు కనీసం రూ.1,000 నుంచి రూ.5,000 వరకు నెలవారీ పింఛన్ అందుతుంది. చందాదారు మరణించిన తర్వాత జీవితభాగస్వామికి కూడా పింఛన్ అందుతుంది. ప్రస్తుతం అటల్ పెన్షన్ యోజన చందాదారుల సంఖ్య దాదాపు 8.30 కోట్లకు చేరింది.

## ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు

వృద్ధుల జనాభా పెరుగుతున్న నేపథ్యంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు, విధానాలు, కార్యాచరణ ప్రణాళికలు చేపట్టింది. దేశంలోని వృద్ధుల సంక్షమ బాధ్యత కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ చూస్తోంది. గౌరవప్రదమైన వృద్ధాప్యాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటోంది.

## ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఫర్ సీనియర్ సిటిజన్స్(ఐపీఎస్ఆర్‌సీ) పథకం

వృద్ధాశ్రమాలు, సంరక్షణ కేంద్రాలు, మొబైల్ మెడికేర్ యూనిట్లు, ఫిజియోథెరఫీ క్లినిక్‌లు, రీజియనల్ రిసోర్స్ అండ్ ట్రైనింగ్ సెంటర్ల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వాలు, ఎన్జీవోలు, యువజన సంఘాలకు కేంద్రం నిధులు ఇస్తోంది. 2025 ఆగస్టు నాటికి దేశవ్యాప్తంగా 696 వృద్ధాశ్రమాలకు ఈ పథకం సహాయం అందిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి కొత్తగా 84 వృద్ధాశ్రమాలు ఎంపికయ్యాయి.




## రాష్ట్రీయ వయోశ్రీ యోజన

వృద్ధాప్య సంబంధ వైకల్యాలతో బాధపడుతున్న 80 ఏళ్లకు పైగా వయసున్న వృద్ధులకు వాకింగ్ స్టిక్‌లు, ఎల్‌బో క్రట్చ్‌లు, వాకర్‌లు, వినికిడి పరికరాలు, వీల్‌చెయిర్‌లు వంటి పరికరాలను అందించే పథకం ఇది. ఈ పరికరాలను ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆర్టిఫిషియల్ లింబ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ తయారుచేస్తుంది. 2025 అక్టోబర్ 15 నాటికి 5,35,651 మంది లబ్ధిదారులకు 28,48,799 పరికరాలు ఈ పథకం ద్వారా అందాయి.

## జాతీయ హెల్ప్‌లైన్

వృద్ధుల కోసం కేంద్రం 2021 అక్టోబర్ 1న జాతీయ హెల్ప్‌లైన్ ప్రారంభించింది. 14567 టోల్-ఫ్రీ నెంబరుకు సంప్రదించి వృద్ధులకు సంబంధించిన సేవలను పొందవచ్చు.

## సీనియర్ కేర్ ఏజింగ్ గ్రోత్ ఇంజిన్(సేజ్) పోర్టల్


వృద్ధుల సంరక్షణ కోసం విశ్వసనీయమైన పరిష్కారాలు అభివృద్ధి చేసేందుకు యువ పారిశ్రామికవేత్తలు, అంకుర సంస్థలకు ఈ పోర్టల్ ఉపయోగపడుతుంది. అంకుర సంస్థల నుంచి వృద్ధులకు అవసరమయ్యే వస్తువులు, సేవలను గుర్తించి, పరిశీలించి, ఒకే వేదికపైకి ఈ పోర్టల్ తీసుకువస్తుంది. ఎంపికైన అంకుర సంస్థలకు ఇండస్ట్రియల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా రూ.1 కోటి వరకు పెట్టుబడి సాయం అందుతుంది.

## ఉపాధిని కల్పించే స్మాడ్ర్ పోర్టల్

వృద్ధులకు ఉపాధి, ఆర్థిక స్వేచ్ఛను అందించేందుకు 2021 అక్టోబర్ 1న సీనియర్ ఏబుల్ సిటిజన్స్ ఫర్ రీ-ఎంప్లాయ్‌మెంట్ ఇన్ డిగ్నిటీ(స్మాడ్ర్) పోర్టల్‌ను కేంద్రం ప్రారంభించింది. 60 ఏళ్లు పైబడిన వారు ఈ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకొని ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు.

## వృద్ధులకూ ఆయుష్మాన్ భారత్

ఆయుష్మాన్ భారత్ - ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన(పీఎంజేఏవై) పథకం సామాజిక-ఆర్థిక వెనుకబటులో ఉన్న కుటుంబాలకు ఉచితంగా ఏడాదికి రూ.5 లక్షల వరకు వైద్య చికిత్సను అందిస్తోంది. 2024 అక్టోబర్ 29న ఈ పథకాన్ని 70 ఏళ్లకు పైబడిన వృద్ధులకు కూడా వర్తింపజేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.




## నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ది హెల్త్‌కేర్ ఆఫ్ ది ఎల్డర్లీ (ఎన్‌పీహెచ్‌సీఈ)

60 ఏళ్లు పైబడిన వృద్ధులకు నాణ్యమైన, సరసమైన సమగ్ర వైద్య సేవలు అందించే కేంద్ర పథకం ఇది. ఈ పథకం కింద జిల్లా ఆసుపత్రుల్లో వృద్ధులకు ప్రత్యేక ఓపీడీ సేవలు, 10 పడకల వార్డు, ఫిజియోథెరఫీ, ల్యాబోరేటరీ సదుపాయాలు వంటివి ఏర్పాటయ్యాయి.

## సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ ఫండ్

వయో వృద్ధుల సంక్షమానికి ఉపయోగపడే వివిధ పథకాలకు సహకరించే నిధి ఇది. స్మాల్ సేవింగ్స్ స్కీమ్, ఈపీఎఫ్‌వో, లైఫ్, నాన్‌లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలు, బొగ్గు గనుల పీఎఫ్ అకౌంట్‌లకు సంబంధించిన అన్‌క్లెయిమ్డ్ నిధులను ఈ నిధికి బదిలీ చేస్తారు.




## గ్రోక్‌పై కేంద్రం మండిపాటు

### ఎక్స్ నివేదికపై అసంతృప్తి


న్యూఢిల్లీ: గ్రోక్ 'ఏఐ' వేదికలో అసభ్యకర, అశ్లీల కంటెంట్‌ను తొలగించాలని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటీసులపై 'ఎక్స్' నివేదికను సమర్పించింది. 'గ్రోక్'కు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన గడువు బుధవారం సాయంత్రంతో ముగిసింది. దీంతో గడువులోగా నివేదికను సమర్పించింది. 'ఎక్స్' ప్లాట్‌ఫాంలోని 'గ్రోక్' ద్వారా మహిళల అభ్యంతరకరమైన చిత్రాలను అనుమతి లేకుండా రూపొందించిన, అశ్లీల కంటెంట్ కార్యకలాపాల్లో పాల్గొన్న ఖాతాలను శాశ్వతంగా నిలిపివేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఐటీ మంత్రిత్వ శాఖకు ఎలాన్ మస్క్ యాజమాన్యంలోని సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' తెలిపింది. అయితే, ఈ సమస్యకు గల కారణాలపై ఎలాంటి సాంకేతిక వివరణ లేకపోవడం, గ్రోక్ అలాంటి చిత్రాలను రూపొందించకుండా నిరోధించే చర్యలు ఈ నివేదికలో లేకపోవడంతో కేంద్రం సంతృప్తిగా లేదని తెలుస్తోంది. తదుపరి చర్యలపై కేంద్రం సమాలోచన చేస్తోందని సమాచారం. 'ఎక్స్'లో అసభ్యకర కంటెంట్‌కు సంబంధించి ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిపై ఆయా సామాజిక మాధ్యమ వేదికలదే బాధ్యత అని కేంద్ర ప్రభుత్వం ఇటీవల స్పష్టం చేసింది. స్థానిక ఐటీ చట్టాలను ఉల్లంఘిస్తూ రూపొందించిన, వ్యాప్తి చేసిన కంటెంట్ మొత్తాన్ని తక్షణమే తొలగించాలని పేర్కొంటూ జనవరి 2న 'ఎక్స్'కు ఆదేశాలు జారీ చేసింది. అభ్యంతరకర కంటెంట్, యూజర్లు, అకౌంట్ల పైనా చర్యలు తీసుకోవాలని, తీసుకున్న చర్యలకు సంబంధించి 72 గంటల్లో నివేదిక అందజేయాలని ఆదేశించింది. కేంద్రం చర్యల నేపథ్యంలో 'ఎక్స్' ఇటీవల కీలక ఆదేశాలు జారీ చేసింది. చట్టవిరుద్ధ కంటెంట్ రూపొందించేందుకు గ్రోక్‌ను ఉపయోగించే వారు తదుపరి పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. అదే సమయంలో నివేదికకు మరింత గడువు కోరగా, కేంద్రం సానుకూలంగా స్పందించి నేటి వరకు సమయం ఇచ్చింది.

## బంధం తెంచుకుంటారా..

# బందీ అవుతారా?

**ఇరాన్, చైనా, రష్యాతో బంధంపై వెనిజువెలాకు ట్రంప్ వార్నింగ్**

**చమురు ఉత్పత్తిలో అమెరికాతోనే భాగస్వామ్యం చేయాలని హుకుం**



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనిజువెలా దేశంపై తన ఆధిపత్యాన్ని చూపించాలని పట్టుదలతో ఉన్నారు. వెనిజువెలాలో ఇటీవల ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా దళాలు బంధించి తీసుకువెళ్లాయి. ఆ తర్వాత డెల్సీ రోడ్రిగెజ్ తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. అయితే ట్రంప్ మాత్రం వెనిజువెలాను తానే నియంత్రిస్తున్నానని ప్రకటిస్తున్నారు. ఇప్పుడు ఆ దేశానికి చెందిన చమురు ఉత్పత్తిని పెంచుకోవాలంటే కొన్ని షరతులు పాటించాలని అమెరికా డిమాండ్ చేస్తోందని ఏబీసీ న్యూస్ నివేదిక వెల్లడించింది. దీని ప్రకారం వెనిజువెలా కొత్త నాయకత్వం చైనా, రష్యా, ఇరాన్, క్యూబాలతో ఆర్థిక సంబంధాలను తెంచుకోవాలి. అంతేకాదు, చమురు ఉత్పత్తిలో అమెరికాతో మాత్రమే భాగస్వామ్యం చేయాలి, ముఖ్యంగా హెవీ క్రూడ్ ఆయిల్ విక్రయాల్లో అమెరికాకు ప్రాధాన్యం ఇవ్వాలి. మరోవైపు, వెనిజువెలా దేశం చైనాతో చాలా సన్నిహిత సంబంధాలు కలిగి ఉంది. చైనా ఆ దేశం నుంచి అత్యధిక చమురు కొనుగోలు చేస్తుంది. ఇప్పుడు అమెరికా తన షరతులను ఎలా రుద్దుతుందనేది కీలకం. యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఒక ప్రైవేట్ మీటింగ్‌లో ఎంపీలతో మాట్లాడుతూ, వెనిజువెలా చమురు ట్యాంకర్లు పూర్తిగా నిండిపోయాయని, అందుకే వారు తమ డిమాండ్లకు లొంగక తప్పదని చెప్పారు. బ్లూంబర్గ్ రిపోర్ట్ ప్రకారం, డిసెంబర్ చివరి నుంచి వెనిజువెలా చమురు బావులను మూసేస్తోంది. ఎందుకంటే అమెరికా ఆంక్షల వల్ల స్టోరేజ్ స్పేస్ లేకుండా పోయింది. మరిన్ని బావులు మూసేస్తే ఆ దేశ ఆర్థిక వ్యవస్థ మరింత కుదేలవుతుంది, తాత్కాలిక అధ్యక్షురాలు రోడ్రిగెజ్ అధికారం కూడా ప్రమాదంలో పడుతుంది. అమెరికా అంచనాల ప్రకారం, వెనిజువెలా రాజధాని కారకాస్‌కు కేవలం కొన్ని వారాల్లోనే ఆర్థికంగా నిర్వీర్యమైపోయే పరిస్థితి వస్తుంది. చమురు విక్రయాలు లేకుండా దేశం తట్టుకోలేదని చెబుతున్నారు. సెనేట్ ఆర్మ్డ్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ రోజర్ వికర్ ఏబీసీ న్యూస్‌తో మాట్లాడుతూ, అమెరికా ప్రభుత్వం వెనిజువెలా చమురును తమ నియంత్రణలోకి తీసుకోవాలని భావిస్తోందని, ఆ ట్యాంకర్లు హవానా వంటి చోట్లకు వెళ్లకుండా చూసుకుంటామని అన్నారు. ఓపెన్ మార్కెట్‌లోకి వెళ్లకుండా ఉంటే మరిన్ని ట్యాంకర్లు నింపే అవకాశం లేదని... ఎందుకంటే అన్నీ పూర్తిగా నిండిపోయాయని ఆయన వివరించారు. అంతేకాకుండా, ట్రంప్ మరో ఆశ్చర్యకరమైన ప్రకటన చేశారు. వెనిజువెలా తాత్కాలిక అధికారులు 30 మిలియన్ నుంచి 50 మిలియన్ బ్యారెల్స్ చమురును అమెరికాకు అప్పగించనున్నారని, దాన్ని మార్కెట్ ధరకు విక్రయించి వచ్చిన డబ్బును తాను నియంత్రిస్తానని చెప్పారు. ఆ నిధులు వెనిజువెలా ప్రజలు మరియు అమెరికా ప్రజల ప్రయోజనాలకు వినియోగిస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ పరిణామాలు వెనిజువెలా భవిష్యత్తును మరింత అనిశ్చితంగా మార్చాయి. అమెరికా ఆధిపత్యం వల్ల ఆ దేశం ఆర్థికంగా ఎలాంటి పరిణామాలు ఎదుర్కొంటుందో చూడాలి. ఇటువంటి ఒత్తిళ్లు ఇతర దేశాలతో సంబంధాలను ఎలా ప్రభావితం చేస్తాయనేది కూడా చర్చనీయాంశం.

## ముసుగుతో వస్తే ఆభరణాలు అమ్మబోం

**బీహార్‌లో బంగారం వ్యాపారుల నిర్ణయం**

పాట్నా: బీహార్‌లోని ఆభరణాల దుకాణాల యజమానులు కీలక నిర్ణయం తీసుకున్నారు. మాస్కులు, హిజాబ్‌లు, నిఖాబ్‌లు, హెల్మెట్‌లు ధరించి ముఖాలను కప్పుకుని వచ్చే కస్టమర్లకు తమ దుకాణాల్లో ప్రవేశం నిరాకరించాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఈ విధానం అమలు చేయడం ఇదే తొలిసారి. బంగారం దుకాణాలలో నేరాలను నిరోధించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు దుకాణాల యజమానులు తెలిపారు. అయితే, ప్రతిపక్ష రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇది రాజ్యాంగ విరుద్ధమని, ఒక నిర్దిష్ట సమాజం యొక్క మతపరమైన భావాలపై దాడి అని ఆరోపిస్తోంది. ముఖం కప్పుకుని వచ్చే కస్టమర్లకు ఆభరణాలు చూపించకూడదని, విక్రయించకూడదని బీహార్ రాష్ట్ర ఆల్ ఇండియా జ్యువెల్లర్స్ అండ్ గోల్డ్ స్మిత్ ఫెడరేషన్ విభాగం నిర్ణయించింది. వినియోగదారులు, యజమానుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని ఫెడరేషన్ విభాగం అధ్యక్షుడు అశోక్ కుమార్ వర్మ వెల్లడించారు. ముఖాలకు ముసుగులు ధరించి వచ్చే వారిని గుర్తించడం కష్టమని, ఏదైనా దొంగతనం జరిగినప్పుడు సీసీటీవీ ఫుటేజీ సాయంతో గుర్తు పట్టేందుకు ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ముఖాలు కనిపించకుండా దుకాణాల్లోకి ప్రవేశించి దొంగతనాలకు పాల్పడుతున్న ఘటనలు దేశవ్యాప్తంగా అనేకం చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. గత ఏడాది మార్చిలో ఇదే తరహాలో వచ్చిన కొందరు దొంగలు భోజ్‌పురి జిల్లాలోని ఒక దుకాణంలో రూ.25 కోట్ల విలువైన ఆభరణాలను చోరీ చేశారు. నవంబర్ నెలలో కూడా సివాన్ నగరంలో ఇలాంటి దోపిడీ జరిగిందని వ్యాపారులు పేర్కొన్నారు.

## ప్లీజ్.. డోనాల్డ్ ట్రంప్

**ఫ్రాన్స్ అధ్యక్షుడు తనను ప్రాధేయపడ్డారంటూ ట్రంప్ హేళన**

న్యూయార్క్: ఒకానొక సందర్భంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మేక్రాన్ తనను ప్రాధేయపడ్డారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఔషధ ధరల పెంపు గురించి ప్రస్తావిస్తూ మేక్రాన్‌ను ఆయన హేళన చేశారు. "ప్లీజ్, డొనాల్డ్ ట్రంప అంటూ మేక్రాన్ తనను బతిమాలారని రిపబ్లికన్ చట్టసభ సభ్యుల సమావేశంలో ట్రంప్ వ్యాఖ్యానించారు. గతంలో ఇరువురి మధ్య జరిగిన సమావేశాన్ని ఆయన ప్రస్తావించారు. ఫ్రాన్స్ ఔషధ ధరలను మూడింతలు పెంచాలని తాను మేక్రాన్‌ను కోరినట్టు, అయితే ఆయన తొలుత అందుకు అంగీకరించలేదని ట్రంప్ తెలిపారు. దాంతో ఫ్రాన్స్ నుంచి దిగుమతి అవుతోన్న వస్తువులపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించినట్లు ఆయన వెల్లడించారు. దీంతో మేక్రాన్ తన డిమాండ్లకు అంగీకరించవలసి వచ్చిందని ట్రంప్ పేర్కొన్నారు. టారిఫ్‌ల గురించి హెచ్చరించిన తర్వాత మేక్రాన్ తనను ప్రాధేయపడ్డారని ట్రంప్ అన్నారు. ఒక ఒప్పందం కుదిరిందని, ఔషధాల ధరలను తాను కోరుకున్నంత పెంచుతానని, కానీ ఈ విషయం తమ ప్రజలకు చెప్పవద్దని మేక్రాన్ బతిమాలినట్లు ట్రంప్ తెలిపారు.

## వయ్యారి చిత్రం





# ‘జన నాయగణ్ణ రిలీజ్‌కి అడ్డంకులు

తమిళ స్టార్ హీరో విజయ్ ‘జన నాయగణ్ణ.. చెప్పిన తేదీకి థియేటర్లలో రిలీజ్ కావడం కష్టమే అనిపిస్తుంది. ఎందుకంటే అలాంటి కష్టాలు ఏర్పడ్డాయి. ఇప్పటికీ సమస్య తీరలేదు. నిర్మాతలు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఈరోజు (జనవరి 07) వాదనలు జరిగాయి. తీర్పు రిజర్వ్‌లో పెట్టారు. 09వ తేదీన ఉదయం తుది ఉత్తర్వులు జారీ కానున్నాయి. ఈ క్రమంలోనే విజయ్ అభిమానులు తెగ టెన్షన్ పడుతున్నారు. ఇంతకీ అసలేమైంది?

రెండు వారాల క్రితమే సెన్సార్ బోర్డు సభ్యులు.. ‘జన నాయగణ్ణ చూశారు. మూడు రోజుల తర్వాత కొన్ని సీన్స్ కట్స్ చేయమని మూవీ టీమ్‌కి సూచించారు. అలా చేస్తే యూ/ఏ సర్టిఫికెట్ ఇస్తామని కూడా చెప్పారు. రెండు రోజుల్లో ఆ ఫార్మాలిటీ అంతా టీమ్ పూర్తి చేశారు. వెంటనే సెన్సార్ సర్టిఫికెట్ వచ్చేస్తుందనుకుంటే.. రెండు రోజుల తర్వాత కూడా సెన్సార్ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో నిర్మాణ సంస్థ మరోసారి అడిగింది.

ఇది జరిగిన తొమ్మిది రోజులకు అంటే జనవరి 05న సినిమాని రివైజింగ్ కమిటీకి పంపుతున్నట్లు, ఏమైనా మాట్లాడాలనుకుంటే ముంబైలోని ఆఫీస్‌ని సంప్రదించాలని సెన్సార్ సభ్యులు.. మూవీ టీమ్‌కి చెప్పారు. దీంతో నిర్మాణ సంస్థ.. సెన్సార్ సర్టిఫికెట్ కోసం హైకోర్టులో అత్యవసర పిటీషన్ వేసింది. త్వరగా సెన్సార్ సర్టిఫికెట్ ఇప్పించేలా చూడాలని పేర్కొంది. తాజాగా ఈ విషయమై బుధవారం (జనవరి 07) ఇరువర్గాల మధ్య వాదనలు జరిగాయి.

‘జన నాయగణ్ చూసిన సభ్యుల్లో ఒకరు.. సినిమాలోని కొన్ని సీన్స్‌పై అభ్యంతరం వ్యక్తం చేశారు. వాటిని రివిజన్ కమిటీ పరిశీలించాలి. తర్వాతే తదుపరి దశకు వెళ్తుంది. మరిన్ని మార్పులు చేయాల్సి వస్తే అది చట్ట ప్రకారం జరుగుతుంది. మూవీ చూసిన తర్వాత అప్పుడు సర్టిఫికెట్ మంజూరా చేస్తాం. మళ్లీ సమీక్షించాలని అవసరం లేదని మీరు(మూవీ టీమ్) కోర్టుకి వచ్చి చెప్పలేరు. చిత్రాన్ని ప్రస్తుతానికి నిలిపి ఉంచాలని సీబీఎఫ్‌సీ ఛైర్ పర్సన్ ప్రాంతీయ కార్యాలయానికి ఇప్పటికే సమాచారం అందించారు. నిర్మాతలకు కూడా జనవరి 05న ఇదే విషయాన్ని చెప్పారు. సినిమాని కొత్త కమిటీ మరోసారి సమీక్షిస్తుంది. అందుకు మరో 15 రోజులు పడుతుంది. దీనికి అంగీకారమైతే కొత్త కమిటీ ఏర్పాటుకు 20 రోజులు పడుతుంది’ అని అదనపు సొలిసిటర్ జనరల్ సుందరేశన్.. కోర్టులో తన వాదనలు వినిపించారు.



## భార్య వేధిస్తోంది: ధనుష్ రాజ్

కన్నడ సీరియల్స్, శివాజీ సూరత్కల్ అనే సినిమాలో నటించిన నటుడు ధనుష్ రాజ్ తన పెళ్లి జీవితం సరిగా లేదని, భార్య తనను టార్చర్ చేస్తుందని పోలీసులను ఆశ్రయించారు. ధనుష్ రాజ్ కు 9 నెలల కిందట ఆశ్రిత అనే యువతితో పెళ్లి జరిగింది. పెళ్లైన తర్వాత నుంచి వీరిద్దరి మధ్య కుటుంబ కలహాలు రావడంతో ఈ జంట ఎప్పుడూ వార్తల్లో నిలుస్తూనే వచ్చారు. తనపై తన భార్య ఆశ్రిత పదే పదే అనుమాన పడుతూ వేధిస్తుందని ధనుష్ గిరినగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో ఈ న్యూస్ కన్నడ ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. తాను అబద్ధం చెప్తున్నానని, తాను వర్క్ పై విదేశాలకు వెళ్తే వేరే మహిళతో విదేశాలకు వెళ్లానని అనుమానించి, తన శారీరకంగా హింసిస్తోందని, తనపై దాడి కూడా చేసిందని ధనుష్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

## ఫ్లాప్‌ల క్వీన్ తగ్గడం లేదుగా!

బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్ ఎన్ని ప్రయోగాలు చేస్తున్నా సరైన ఫలితాలు మాత్రం రావడం లేదు. కంగన నటించిన చిత్రాలు భారీ అంచనాల మధ్య రిలీజ్ అయినా ఫలించలేదు. ఈ రెండు సినిమాల కోసం కంగన ఎంతగానో శ్రమించింది. స్పై జానర్లో మొట్టి మొదటి లేడీ స్పై గా బాలీవుడ్ లో సత్తా చాటాలని చేసిన ప్రయత్నాలివి. కానీ పని తప్ప ఫలితం కనిపించలేదు. చివరిగా ఇందిరాగాంధీ బయోపిక్ తో మరోసారి దేశభక్తిని చాటుకోవాలనుకుంది. ఆ సినిమా కూడా నిరాశనే మిగిల్చింది. అయినా సరే కంగన మాత్రం ఎక్కడా నెరవలేదు. హిట్ కొట్టే వరకూ ప్రయత్నం ఆపనంటూ పని చేస్తోంది. మరోసారి దేశభక్తిని చాటుకునే ప్రయత్నం చేస్తోంది. భారత భాగ్య విధాత టైటిల్ తో మరో సినిమా చేస్తున్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ప్రాజెక్ట్ గురించి కంగన ఇంత వరకూ ఎక్కడా ప్రకటించలేదు. బాలీవుడ్ మీడియాలో కూడా ఎలాంటి ప్రచారం తెరపైకి రాలేదు. కానీ సినిమా ఆన్ సెట్స్ లో ఉందని అధికారికంగా ప్రకటించింది. తన సొంత నిర్మాణ సంస్థ మణికర్ణిక ఫిల్మ్స్ ప్రొడక్షన్ బ్యానర్ పైనే నిర్మిస్తోంది. అయితే ఈ సినిమాకు తానే స్వీయా దర్శకత్వంలో నిర్మిస్తోందా? లేక పాత్ర , నిర్మాణం వరకే పరిమితమవుతుందా? అన్న వివరాలు మాత్రం వెల్లడించలేదు.





## సామ్ ఈజ్‌బ్యాక్

సామ్ తన అభిమానులకు సడన్ సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఓ కొత్త పోస్టర్‌ని అభిమానులతో పంచుకున్న సమంత దీనికి ఆసక్తికరమైన క్యాప్షన్‌ని జోడించింది. ‘మీరు చూస్తా ఉండండి.. మా ఇంటి బంగారం మీతో కలిసిపోతుంది’ అని క్యాప్షన్ ఇచ్చింది. అంతే కాకుండా మూవీ టీజర్‌ని జనవరి 9న సంక్రాంతి సందర్భంగా రిలీజ్ చేస్తున్నట్టుగా వెల్లడించారు. దీంతో అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. నెట్టింట క్వీన్ ఈజ్ బ్యాక్ అని కామెంట్లు చేస్తున్నారు. ఓ బేబీ తరువాత సమంత, నందినిరెడ్డి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా ఇది. గతేడాది అక్టోబర్‌లోనే ఈ మూవీ షూటింగ్‌ని ప్రారంభించారు. సామ్ తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవీంగ్ పిక్చర్స్‌పై నిర్మిస్తోంది. దర్శకుడు, సామ్ భర్త రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. 1980 నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ స్టోరీతో ఈ మూవీని రూపొందిస్తున్నారు. బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య కీలక పాత్రలో నటిస్తున్న ఈ మూవీపై సామ్ భారీ అంచనాలు పెట్టుకుంది.


## శ్రీలీల స్ట్రాంగ్ డెసిషన్

యంగ్ బ్యూటీ శ్రీ లీలా గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. తన అందం, అభినయంతో ఎంతోమంది కుర్రకారు హృదయాలను దోచుకున్న ఈ ముద్దుగుమ్మ.. ఈమధ్యకాలంలో భాషతో సంబంధం లేకుండా అవకాశాలు అందుకుంటూ బిజీగా మారిపోయింది. ప్రస్తుతం ఈమె నటిస్తున్న చిత్రం పరాశక్తి. సుధా కొంగర దర్శకత్వంలో శివ కార్తికేయన్ హీరోగా వస్తున్న ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా విడుదల కాబోతోంది. ఈ నేపథ్యంలోనే పలు ప్రమోషనల్ కార్యక్రమాలు చేపట్టిన శ్రీలీల.. తాజాగా తాను తీసుకున్న కఠిన నిర్ణయం గురించి చెప్పి అందరిని ఆశ్చర్యపరిచింది. ప్రమోషన్స్‌లో భాగంగా గతంలో ఈమె పుష్ప 2 సినిమాలో స్పెషల్ సాంగ్ చేయడంపై ప్రశ్న ఎదురవగా.. ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. “నేను ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలోనే నేను నటించే సినిమాలలో మాత్రమే స్పెషల్ సాంగ్ చేయాలనుకున్నాను. కానీ పుష్ప2 సినిమాలో తప్పని పరిస్థితుల్లో ఓకే చెప్పాను. ఇది చాలా కఠిన నిర్ణయం అయినా.. ఈ సినిమా నాకు ఊహించని ఇమేజ్ ను అందించింది. కాబట్టి ఈ పాట చేయడం మంచి నిర్ణయమే అనిపించింది. అయితే ఇకపై నా సినిమాలలో తప్ప ఇతర హీరోల సినిమాలలో స్పెషల్ సాంగ్ చేయకూడదని నిర్ణయం తీసుకున్నాను” అంటూ చెప్పుకొచ్చింది శ్రీలీల.



## ప్యారడైజ్ వాయిదా!

ఈ ఏడాది మార్చి చివరి వారానికి టాలీవుడ్ నుంచి రెండు క్రేజీ మూవీస్ బాక్సాఫీస్ పోరుకు సిద్ధమైన సంగతి తెలిసిందే. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మూవీ పెద్దితో పాటు నేచురల్ స్టార్ నాని సినిమా ది ప్యారడైజ్ ఆ వీకెండ్‌ను రిలీజ్ కోసం ఎంచుకున్నాయి. వీటిలో ఏదో ఒకటి రేసు నుంచి తప్పుకుంటుందనే ప్రచారం సాగినా.. రెండు చిత్ర బృందాలూ ఆ డేట్‌కే కట్టుబడి ప్రోమోలు రిలీజ్ చేస్తూ వచ్చాయి. ఈ మధ్య కూడా పెద్ది, ది ప్యారడైజ్ టీమ్స్ కొత్త పోస్టర్లు రిలీజ్ చేసి వాటి మీద విడుదల తేదీలను ప్రకటించాయి. కానీ ఇప్పుడు నాని మూవీ రేసు నుంచి తప్పుకోనున్నట్లు వెల్లడైంది. స్వయంగా నిర్మాత సుధాకర్ చెరుకూరి ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ది ప్యారడైజ్ మూవీకి సంబంధించి సగమే చిత్రీకరణ పూర్తయినట్లు ఆయన వెల్లడించారు. ఇప్పటిదాకా 60 రోజుల షూట్ జరిగినట్లు వెల్లడించారు.





**సంక్షిప్త స్కోర్లు:**

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 384 ఆలౌట్

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 567 ఆలౌట్

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ 302/8

# 134 ఏళ్ల రికార్డ్ బద్దలు

**చరిత్ర సృష్టించిన ఆస్ట్రేలియా ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక 50 ప్లస్ భాగస్వామ్యాలు**

టెస్ట్ క్రికెట్‌లో ఆస్ట్రేలియా చరిత్ర సృష్టించింది. యాషెస్ సిరీస్ చరిత్రలోఅబశ్రీశ్రీనే ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక 50 ప్లస్ భాగస్వామ్యాలను నమోదు చేసిన జట్టుగా నిలిచింది. ఈ క్రమంలో ఆ జట్టు 134 ఏళ్ల రికార్డ్‌ను బద్దలు కొట్టింది. 1892లో అడిలైడ్ వేదికగా జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఆరు 50 ప్లస్ భాగస్వామ్యాలను నమోదు చేసింది. ఈ రికార్డ్‌ను ఇప్పుడు ఆసీస్ అధిగమించింది.

యాషెస్ సిరీస్ 2025 - 26లో భాగంగా సిడ్నీ వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఆఖరి టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో ఈ ఫీట్ సాధించింది. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 133.5 ఓవర్లలో 567 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్(166 బంతుల్లో 24 ఫోర్లు, సిక్స్‌తో 163), కెప్టెన్ స్టీవ్ స్మిత్(220 బంతుల్లో 16 ఫోర్లు, సిక్స్‌తో 138 నాటౌట్) భారీ శతకాలతో చెలరేగారు.



ఈ ఇన్నింగ్స్‌లో ఆసీస్ తొలి వికెట్‌కు 57 పరుగులు, రెండో వికెట్‌కు 105, మూడో వికెట్‌కు 72, నాలుగో వికెట్‌కు 54, ఐదో వికెట్‌కు 51, ఏడో వికెట్‌కు 71, 8వ వికెట్‌కు 107 పరుగుల భాగస్వామ్యాలు నమోదయ్యాయి. యాషెస్ క్రికెట్ చరిత్రలోనే ఒకే ఇన్నింగ్స్‌లో ఇలా ఏడు 50 ప్లస్ భాగస్వామ్యాలు నమోదు కావడం ఇదే తొలిసారి. టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక 50 ప్లస్ భాగస్వామ్యాలు నమోదు చేసిన రికార్డ్ భారత్ పేరిట ఉంది. 2007లో భారత్ ఒకే ఇన్నింగ్స్ ఎనిమిది 50 ప్లస్ భాగస్వామ్యాలు నమోదు చేసి ఈ ఘనతను అందుకుంది. 2007లో ఇంగ్లండ్‌తో ది ఓవల్ వేదికగా జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో రాహుల్ ద్రవిడ్ సారథ్యంలో భారత జట్టు ఈ వరల్డ్ రికార్డ్ నమోదు చేసింది. ఈ మ్యాచ్‌లోనే అనిల్ కుంబ్లే తన తొలి టెస్ట్ సెంచరీ నమోదు చేశాడు. అప్పటి నుంచి ఈ రికార్డ్ చెక్కు చెదరకుండా ఉంది. తాజాగా ఆసీస్ ఈ ఫీట్ సాధించి రెండో స్థానంలో నిలిచింది.

### ఓటమి ముంగిట ఇంగ్లండ్

యాషెస్ సిరీస్‌లో భాగంగా సిడ్నీ వేదికగా జరుగుతున్న ఆఖరి టెస్ట్‌లోనూ ఇంగ్లండ్ ఓటమి దిశగా సాగుతోంది. 184 పరుగుల భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 75 ఓవర్లలో 8 వికెట్లకు 302 పరుగులు చేసింది. క్రీజులో జాకోబ్ బెతెల్(232 బంతుల్లో 15 ఫోర్లతో 142 నాటౌట్)తో పాటు మాథ్యూ పాట్స్(0 బ్యాటింగ్) ఉన్నారు. జోరూట్(6), విల్ జాక్స్(0), బెన్ స్టోక్స్(1), జాక్ క్రాలీ(1) తీవ్రంగా నిరాశపర్చగా.. బెన్ డకెట్(42), హ్యారీ బ్రూక్(42) పర్వాలేదనిపించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో బ్యూ వెబ్‌స్టర్(3/51) మూడు వికెట్లు తీయగా.. స్కాట్ బోలాండ్(2/34) రెండు వికెట్లు పడగొట్టాడు. మిచెల్ స్టార్క్, మైకేల్ నెసర్ తలో వికెట్ తీసారు. ప్రస్తుతం ఇంగ్లండ్ 119 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. 518/7 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన ఆసీస్ 133.5 ఓవర్లలో 567 పరుగులకు ఆలౌటైంది. ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్(166 బంతుల్లో 24 ఫోర్లు, సిక్స్‌తో 163), కెప్టెన్ స్టీవ్ స్మిత్(220 బంతుల్లో 16 ఫోర్లు, సిక్స్‌తో 138 నాటౌట్) భారీ శతకాలతో రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్(3/130), జోష్ టంగ్(3/97), మూడు వికెట్లు తీయగా.. బెన్ స్టోక్స్(2/95) రెండు వికెట్లు పడగొట్టాడు. విల్ జాక్స్, జాకోబ్ బెతెల్ తలో వికెట్ తీసారు. ఆఖరి రోజు ఇంగ్లండ్‌ను త్వరగా ఆలౌట్ చేస్తే ఆస్ట్రేలియాకు విజయం దక్కుతుంది. ఈ మ్యాచ్‌లో గట్టెక్కాలంటే ఇంగ్లండ్ ఆఖరి రోజంతా బ్యాటింగ్ చేయాలి. ఇది అసాధ్యం.



# ఆ రాష్ట్రాల ఆటగాళ్లకే చోటు

**సెలక్షన్ కమిటీపై ఊతప్ప ఫైర్**

ముంబై, ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాలకు చెందిన ఆటగాళ్లకే భారత జట్టులో సుస్థిర స్థారం ఉంటుందని టీమిండియా మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప అన్నాడు. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌కు రుతురాజ్ గైక్వాడ్‌ను ఎంపిక చేయకపోవడాన్ని తప్పుబట్టిన ఊతప్ప.. ఈ నిర్ణయం తనను ఆశ్చర్యానికి గురి చేసిందని చెప్పాడు. జనవరి 11 నుంచి న్యూజిలాండ్అబశ్రీశ్రీతో భారత్ మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్ కోసం ఎంపిక చేసిన జట్టులో రుతురాజ్ గైక్వాడ్‌కు అవకాశం దక్కలేదు. ఈ విషయంపై తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన రాబిన్ ఊతప్ప సంచలన వ్యాఖ్యలు చేశాడు. 'మిత్రమా(రుతురాజ్ గైక్వాడ్).. సెలెక్టర్ల నిర్ణయాన్ని జీర్ణించుకోవడం చాలా కష్టం. అయినా మరింత కష్టపడటం కొనసాగించాలి. భారత క్రికెట్‌లో ఉన్న సవాళ్లలో ఇది కూడా ఒకటి అని గ్రహించాలి. ముఖ్యంగా ముంబై, ఢిల్లీ, పంజాబ్ వంటి ప్రధాన క్రికెట్ కేంద్రాల నుంచి రాకపోతే.. క్రికెటర్లు టీమిండియాలో స్థానం సుస్థిరం చేసుకోవడానికి మరింత కష్టపడాల్సి ఉంటుంది' అని రాబిన్ ఊతప్ప అన్నాడు.



# రో-కోను తక్కువ అంచనా వేయం: బ్రేస్‌వెల్

టీమిండియా స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలను తక్కువ అంచనా వేయమని న్యూజిలాండ్ వన్డే కెప్టెన్ మైఖేల్ బ్రేస్‌వెల్ అన్నాడు. ఈ ఇద్దరూ ఆటగాళ్లు ఇప్పటికీ సూపర్ ఫామ్‌లో ఉన్నారని, భారత జట్టుకు వారి అవసరం ఎంతో ఉందని చెప్పుకొచ్చాడు. మూడు వన్డేలు, ఐదు టీ20ల కోసం న్యూజిలాండ్ భారత్ పర్యటనకు వచ్చిన సంగతి తెలిసిందే. జనవరి 11న వడోదర వేదికగా జరిగే తొలి వన్డే మ్యాచ్‌తో న్యూజిలాండ్ పర్యటన మొదలు కానుంది. ఈ సిరీస్ నేపథ్యంలో ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మైఖేల్ బ్రేస్‌వెల్.. రోహిత్, కోహ్లీలపై ప్రశంసల జల్లు కురిపించారు. ఈ ఇద్దరూ 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడాలని కోరుకుంటున్నట్లు తెలిపాడు. 'రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి దిగ్గజాలను తక్కువ అంచనా వేయడం చాలా పెద్ద పొరపాటు. వారు ఇప్పటికీ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారు. జట్టుకు వారి అవసరం కూడా ఎంతో ఉంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వచ్చే ఏడాది (2027) జరిగే వన్డే ప్రపంచకప్‌లో కూడా ఆడాలని నేను కోరుకుంటున్నాను. వారు ప్రస్తుతం అద్భుతంగా బ్యాటింగ్ చేస్తున్నారు. వారిని జట్టులో నుంచి తొలగించడానికి ఎటువంటి కారణం నాకు కనిపించడం లేదు. వారి వ్యక్తిగత రికార్డులే వారు ఎంటో ప్రపంచానికి చెబుతాయి. భారత జట్టు సాధించిన ఎన్నో గొప్ప విజయాల్లో వారు భాగంగా ఉన్నారు. అటువంటి దిగ్గజాలను విమర్శించడం లేదా తక్కువ అంచనా వేయడం మూరత్వమే అవుతుంది.'అని బ్రేస్‌వెల్ చెప్పుకొచ్చాడు. ఈ మూడు వన్డేల సిరీస్‌కు న్యూజిలాండ్ కీలక ఆటగాళ్లు మిచెల్ సాంట్నర్, టామ్ లాథమ్, రచిన్ రవీంద్ర అందుబాటులో లేకుండా పోయారు. దీంతో మైఖేల్ బ్రేస్‌వెల్‌కు కెప్టెన్సీ బాధ్యతలు దక్కాయి. ఫిబ్రవరి జరిగే టీ20 ప్రపంచకప్‌కు సన్నద్ధమవ్వడానికి ఈ సిరీస్ ఉపయోగపడుతుందని బ్రేస్ వెల్ తెలిపాడు.

**భారత్, న్యూజిలాండ్ షెడ్యూల్..**

మొదటి వన్డే జనవరి 11 వడోదర

రెండవ వన్డే జనవరి 14 రాజ్‌కోట్

మూడవ వన్డే జనవరి 18 ఇండోర్




# వైభవ్ ఊచకోత

## 63 బంతుల్లోనే సెంచరీ

టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ మరోసారి దుమ్మురేపాడు. అండర్ 19 ప్రపంచకప్‌కు సన్నాహకంగా సౌతాఫ్రికాతో జరుగుతున్న యూత్ వన్డే సిరీస్ మూడో మూడో మ్యాచ్‌లో 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ సెంచరీతో చెలరేగాడు. తనదైన విధ్వంసకర బ్యాటింగ్‌తో 63 బంతుల్లోనే శతకం సాధించాడు. 74 బంతుల్లో 9 ఫోర్లు, 10 సిక్స్‌లతో 127 పరుగులు చేశాడు. అతనికి తోడుగా ఆరోన్ జార్జ్(106 బంతుల్లో 16 ఫోర్లతో 118) సెంచరీతో చెలరేగడంతో ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ అండర్ 19 జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 393 పరుగులు చేసింది. సౌతాఫ్రికా బౌలర్లలో ఎంటాండో సోని(3/61) మూడు వికెట్లు తీయగా.. జాసన్ రోల్స్(2/59) రెండు వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ అండర్ 19 జట్టుకు ఓపెనర్లు ఆరోన్ జార్జ్, వైభవ్ సూర్యవంశీ అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. ఆకాశమే హద్దుగా చెలరేగిన వైభవ్ 63 బంతుల్లోనే సెంచరీ మార్క్ అందుకున్నాడు. 171.62 స్ట్రైక్‌రేట్‌తో 10 సిక్స్‌లు, 9 ఫోర్లతో వీరవిహారం చేశాడు. భారీ షాట్ ఆడే క్రమంలో అతను క్యాచ్ ఔటవ్వడంతో తొలి వికెట్‌కు నమోదైన 227 పరుగుల భారీ భాగస్వామ్యానికి తెరపడింది. ఆ కాసేపటికే ఆరోన్ జార్జ్ ఔటవ్వగా.. వేదాంత్ త్రివేది(34), మోహమద్ ఇనామ్(19 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 28 నాటౌట్) రాణించారు. ఇప్పటికే ఈ సిరీస్‌ను భారత అండర్ 19 టీమ్ 2-0తో కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్ కూడా గెలిచి సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయాలనే పట్టుదలతో ఉంది. ఈ సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీ వరుసగా 11, 68, 127 పరుగులతో రాణించాడు. ఈ సిరీస్‌కు ముందు బిహార్ తరఫున విజయ్ హజారే ట్రోఫీ ఆడిన వైభవ్ సూర్యవంశీ.. అరుణాచల్ ప్రదేశ్‌పై 190 పరుగులతో విధ్వంసం సృష్టించాడు. అతని ధాటికి లిస్ట్-ఏ క్రికెట్ చరిత్రలోనే బీహార్ రికార్డ్ స్కోర్ నమోదు చేసింది.

# మార్చి 5న అర్జున్-సానియా పెళ్లి!



క్రికెట్ దేవుడిగా పేరుగాంచిన సచిన్ టెండూల్కర్ ఇంట్లో త్వరలో పెళ్లి భాజాలు మోగనున్నాయి. ఈ మేరకు పెళ్లి ముహూర్తం ఫిక్స్ చేశారు. ఇకపోతే గత ఏడాది నిశ్చితార్థాన్ని అత్యంత సన్నిహితులు కుటుంబ సభ్యుల మధ్య రహస్యంగా వివాహం చేసుకున్న అర్జున్ టెండూల్కర్ ఈసారి ధూంధాం గా తన పెళ్లిని చేసుకోబోతున్నట్లు సమాచారం. అసలు విషయంలోకి వెళ్తే.. సచిన్ టెండూల్కర్ కొడుకు అర్జున్ టెండూల్కర్ త్వరలో సానియా చందోక్ ను వివాహం చేసుకోబోతున్నారు.ఆగస్టు 2025లో అతి కొద్ది మంది సమక్షంలో ఇరువురు నిశ్చితార్థం చేసుకోగా.. ఆ సమయంలో సోషల్ మీడియాలో వీరు రహస్యంగా నిశ్చితార్థం చేసుకున్నట్లు వార్తలు వచ్చాయి. దీంతో సచిన్ టెండూల్కర్ అభిమానులు సోషల్ మీడియా వేదికగా ఆయనను ప్రశ్నించగా .. అభిమానుల కోసం అధికారికంగా ఎక్స్ వేదికగా సచిన్ స్పందిస్తూ.. అర్జున్ వచ్చే ఏడాది కొత్త జీవితంలోకి అడుగుపెట్టబోతున్నారు అంటూ క్లారిటీ ఇచ్చారు. ఇప్పుడు పెళ్లికి ముహూర్తం ఖరారు చేశారు. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం.. అర్జున్ - సానియాల వివాహం 2026 మార్చి 5న జరగనుంది. ఇక వివాహానికి ముందు వేడుకలు మార్చి 3వ తేదీ నుంచి ప్రారంభం కాబోతున్నాయిఇకపోతే నిశ్చితార్థంతో ఒకటైన ఈ జంట ఈ ఏడాది ఏడడుగులు వేయబోతున్నారు.




# నన్ను ఎవరూ తప్పించలేదు: రిధిమా పాఠక్

బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్(బీపీఎల్)కు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న భారత్‌కు చెందిన రిధిమా పాఠక్ హోస్టింగ్ ప్యానల్ నుంచి తప్పుకోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. భారత్‌కు చెందిన వ్యక్తి కావడంతోనే బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(బీసీసీఐ) ఆమెను తొలిగించిందని వార్తలు వచ్చాయి. కానీ ఈ ప్రచారాన్ని రిధిమా పాఠక్ ఖండించింది. ఇందులో వాస్తవం లేదని, తనను ఎవరూ తప్పించలేదని స్పష్టం చేసింది. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో తానే తప్పుకున్నట్లు సోషల్ మీడియా వేదికగా వివరణ ఇచ్చింది. 'బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ హోస్ట్ ప్యానల్ నుంచి నన్ను తొలగించారు అనే వార్తలు వినిపిస్తున్నాయి. కానీ వాటిలో నిజం లేదు. బీపీఎల్ నుంచి వైదొలగాలని నేను వ్యక్తిగతంగా నిర్ణయం తీసుకున్నాం. నాకు దేశమే ముఖ్యం.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం www.evarthalu.com
నేటి ఈవార్తలు
గురువారం 8-1-2026

...నేడు స్టీఫెన్ హాకింగ్ జయంతి...

# ఆధునిక విజ్ఞాన శిఖరం.. స్టీఫెన్ హాకింగ్



విశ్వం అనంతమైన రహస్యాలను ఛేదించి, మనిషి సంకల్పానికి అసాధ్యం అంటూ ఏదీ లేదని నిరూపించిన ఆధునిక విజ్ఞాన శిఖరం స్టీఫెన్ హాకింగ్. జనవరి 8 ఆయన జన్మదినం సందర్భంగా, ఆయన జీవితం, వైకల్యంపై ఆయన సాధించిన విజయం, సైన్స్ రంగానికి ఆయన అందించిన అద్భుత కానుకలపై మనం మాట్లాడుకొని తీరాలి. విశ్వం ఎక్కడ మొదలైంది? కాలం ఎప్పుడు ప్రారంభమైంది? నక్షత్రాలు ఎలా అంతరించిపోతాయి? ఈప్రశ్నలు వేల ఏళ్లుగా మానవాళిని వేధిస్తూనే ఉన్నాయి. కానీ, చక్రాల కుర్చీకే పరిమితమై, మాట్లాడే శక్తిని కూడా కోల్పోయి, కేవలం తన మెదడులోని ఆలోచనల ద్వారా ఈ రహస్యాలకు సమాధానాలు వెతికిన మహా శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్. ఆయన జీవితంకేవలం సైన్స్ పాఠం మాత్రమే కాదు, కుంగిపోతున్న సామాన్యుడికి ఒక ధైర్యపాఠం.

స్టీఫెన్ విలియం హాకింగ్ 1942, జనవరి 8న ఇంగ్లాండ్‌లోని ఆక్స్‌ఫర్డ్‌లో జన్మించారు. సరిగ్గా ఆధునిక ఖగోళ శాస్త్ర పితామహుడు గెలీలియో గెలీలీ మరణించిన 300వ వర్ధంతి రోజే హాకింగ్ జన్మించడం ఒక చారిత్రక యాదృచ్ఛికం. చిన్నతనం నుంచే ఆయనకు గణితం, భౌతిక శాస్త్రం అంటే మక్కువ ఎక్కువ. తండ్రి వైద్యుడిగా చూడాలనుకున్నా, హాకింగ్ మాత్రం విశ్వం వైపు తన చూపు మళ్లించారు. ఆయన జీవితం మలుపు తిరిగింది 21 ఏళ్ల వయసులో. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో పరిశోధనలు చేస్తున్న సమయంలో ఆయనకు అరుదైన నరాల వ్యాధి సోకింది. వైద్యులు ఆయనకు కేవలం రెండు సంవత్సరాల ఆయుష్షు మాత్రమే ఉందని తేల్చి చెప్పారు. కానీ హాకింగ్ కుంగిపోలేదు. 'చనిపోవడానికి నేను సిద్ధంగా లేను, ఇంకా చేయాల్సింది చాలా ఉంది' అని తనలో తాను నిర్ణయించుకున్నారు. ఆ మొండి పట్టుదలే ఆయనను మరో 55 ఏళ్లు బతికించడమే కాకుండా, ప్రపంచం గర్వించే మేధావిని చేసింది.

### విశ్వ రహస్యాల అన్వేషణ

స్టీఫెన్ హాకింగ్ చేసిన అతిపెద్ద పరిశోధనలు కృష్ణ బిలాలు గురించి. ఒకప్పుడు బ్లాక్ హెూల్స్ నుంచి ఏదీ బయటకు రాదని, అది ప్రతి వస్తువును మింగేస్తుందని భావించేవారు. కానీ హాకింగ్ తన గణిత మేధస్సుతో బ్లాక్ హెూల్స్ నుంచి కూడా కిరణాలు వెలువడతాయని, చివరకు అవి ఆవిరైపోతాయని నిరూపించారు. దీనినే హాకింగ్ రేడియేషన్ అని పిలుస్తారు. ఈ ఆవిష్కరణ క్వాంటం మెకానిక్స్, జనరల్ రిలేటివిటీ సిద్ధాంతాలను అనుసంధానించడంలో కీలక పాత్ర పోషించింది. ఐన్‌స్టీన్ సిద్ధాంతాలను ఆయన ముందుకు తీసుకెళ్లిన తీరు అద్వితీయం. చాలామంది శాస్త్రవేత్తలు క్లిష్టమైన సూత్రాలకే పరిమితమవుతారు. కానీ హాకింగ్ సామాన్య ప్రజలకు సైన్స్‌ను పరిచయం చేయాలనుకున్నారు. ఆయన రాసిన 'ఏ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్' పుస్తకం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అత్యంత సంక్లిష్టమైన విశ్వ పరిణామ క్రమాన్ని సామాన్యుడికి అర్థమయ్యే భాషలో వివరించారు. ఈ పుస్తకం కొన్ని కోట్ల కాపీలు అమ్ముడై, ప్రపంచంలోనే అత్యధికంగా అమ్ముడైన సైన్స్ పుస్తకాలలో ఒకటిగా నిలిచింది. 1985లో ఆయనకు మాట కూడా పడిపోయింది. ఆ తర్వాత ఒక ప్రత్యేకమైన కంప్యూటర్ సిస్టమ్ ద్వారా ఆయన తన భావాలను వ్యక్తం చేసేవారు. కేవలం తన బుగ్గలోని ఒక కండర కదలిక ద్వారా కంప్యూటర్‌ను నియంత్రిస్తూ పరిశోధనలు కొనసాగించారు. విధి ఆయన్ని బంధించినా, ఆయన ఆలోచనలు మాత్రం నక్షత్రాల మధ్య విహరించాయి.

ప్రస్తుత పోటీ ప్రపంచంలో చిన్నపాటి విఫలాలకే కుంగిపోయే యువతకు హాకింగ్ జీవితం ఒక పెద్ద వెలుగు. ఆయనకు అనారోగ్యం శాపం కాలేదు, అన్వేషణకు ఆయుధమైంది. శరీరం సహకరించకపోయినా మెదడును చురుగ్గా ఉంచుకోవడం. విశ్వం ఎందుకు ఇలా ఉంది? అసలు దేవుడు ఉన్నాడా? వంటి ప్రశ్నలను నిర్భయంగా శాస్త్రీయ కోణంలో విశ్లేషించడం. చివరి శ్వాస వరకు మానవాళి మనుగడ కోసం, కృత్రిమ మేధ ప్రమాదాల గురించి హెచ్చరించడం వరకు ఆయన అప్రమత్తంగా ఉన్నారు. 2018 మార్చి 14న (ఐన్‌స్టీన్ పుట్టినరోజు, 'పై' దినోత్సవం రోజు) హాకింగ్ పరమపదించారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన కనిపెట్టిన సిద్ధాంతాలు, ఆయన చూపిన ధైర్యం కలకాలం నిలిచి ఉంటాయి. ఆయనను స్మరించుకోవడం అంటే కేవలం ఆయన విజయాలను పొగడటం కాదు, ప్రతికూల పరిస్థితుల్లో కూడా ఆశావహ దృక్పథంతో ముందడుగు వేయడం. విజ్ఞాన శాస్త్రపు ఆకాశంలో స్టీఫెన్ హాకింగ్ ఒక ధ్రువతార. వైకల్యం అనేది శరీరానికే కానీ ఆలోచనలకు కాదని నిరూపించిన ఈ యుగకర్తకు మనందరి ఘన నివాళి.

> "మీ కాళ్ల వైపు కాకుండా నక్షత్రాల వైపు చూడటం మర్చిపోకండి. పనిని ఎప్పుడూ వదిలిపెట్టకండి. పని జీవితానికి అర్థాన్ని, పరమార్థాన్ని ఇస్తుంది."
> – స్టీఫెన్ హాకింగ్

- కార్తీక్ సూర్య
స్కాలర్, ఉస్మానియా యూనివర్సిటీ

# వద్దు బట్టీ.. అన్వేషణ మొదలెట్టు!

విజ్ఞాన శాస్త్రం అంటే కేవలం పుస్తకాల్లోని పేజీలు తిరగేయడం కాదు, కళ్ల ముందు కనిపిస్తున్న నిజాన్ని ప్రశ్నించి నిరూపించడం. సరిగ్గా ఇదే సూత్రాన్ని నమ్మి, భూమి తన అక్షం చుట్టూ తాను తిరుగుతోందని ఒక లోలకం సాయంతో ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు లియో ఫోకాల్ట్. నేడు ఆయన గౌరవార్థం మనం జరుపుకుంటున్న ఈ సందర్భం, మన విద్యావ్యవస్థ గమనాన్ని పునఃసమీక్షించుకోవడానికి ఒక గొప్ప అవకాశం.

నేటి ఆధునిక కాలంలో పాఠశాలలు, కళాశాలలు విజ్ఞాన కేంద్రాలుగా కాకుండా 'బట్టీ పట్టే కర్మాగారాలుగా' మారుతున్నాయన్నది చేదు నిజం. విద్యార్థులు సూత్రాలను, సిద్ధాంతాలను పరీక్షల్లో మార్కుల కోసం కంఠస్థం చేస్తున్నారే తప్ప, వాటి వెనుక ఉన్న సహేతుకతను, తర్కాన్ని అర్థం చేసుకోవడం లేదు. 'భూమి గుండ్రంగా ఉంటుంది', 'భూమి తన చుట్టూ తాను తిరుగుతుంది' అని పుస్తకంలో చదివి ఒప్పగించడం సులభం. కానీ, "మనం భూమి మీద నిలబడి ఉన్నప్పుడు అది తిరుగుతున్నట్లు మనకు ఎందుకు అనిపించదు?" అని ప్రశ్నించే తత్వాన్ని విద్యార్థుల్లో చంపేస్తున్నాం.

### ఫోకాల్ట్ స్ఫూర్తి

1851లో ఫోకాల్ట్ తన ప్రయోగాన్ని ప్రదర్శించినప్పుడు, ఆయన ముందున్నది కేవలం ఒక లోహపు గోళం, పొడవైన వైరు మాత్రమే. కానీ ఆయన మెదడులో ఉన్నది ప్రశ్న. ఒక సామాన్యమైన పరికరంతో విశ్వం రహస్యాన్ని అన్వేషించవచ్చని ఆయన నిరూపించారు. నేటి విద్యార్థికి కావాల్సింది అటువంటి ఆలోచనా ధోరణి. ఎందుకు? ఎలా? అనే రెండు చిన్న ప్రశ్నలే ప్రపంచంలో జరిగిన అన్ని గొప్ప ఆవిష్కరణలకు పునాది. ఈ ప్రశ్నలు అడగకుండా ఆపివేసిన రోజే విజ్ఞాన శాస్త్రం కుంటుపడుతుంది. మనం కేవలం నల్లబల్లపై బొమ్మలు గీసి విజ్ఞానాన్ని బోధించలేం. పాఠశాలల్లో ప్రయోగాత్మక విద్య విలాసం కాదు, అది ఒక ప్రాథమిక అవసరం. విద్యార్థి తన చేతులతో ఒక చిన్న విద్యుత్ వలయాన్ని నిర్మించినప్పుడు లేదా ఒక లోలకం ఊగడాన్ని గమనించినప్పుడు కలిగే జ్ఞానం, వంద పేజీల పుస్తక పఠనం కంటే మిన్న. ఫోకాల్ట్ లోలకం మనకు నేర్పే పాఠం ఒక్కటే.. జ్ఞానం అనుభవం ద్వారా, పరిశీలన ద్వారా రావాలి.

### మార్పు ఎక్కడ మొదలవ్వాలి?

పాఠ్యపుస్తకాలలోని పాఠాలకు మాత్రమే పరిమితం కాకుండా, నిత్య జీవితంలో జరిగే భౌతిక, రసాయన మార్పులను గమనించేలా విద్యార్థులను ప్రోత్సహించాలి. తరగతి గదిలో విద్యార్థి అడిగే వింత ప్రశ్నలను హేళన చేయకుండా, వాటిని శాస్త్రీయంగా విశ్లేషించే వాతావరణం ఉండాలి. ప్రతి పాఠశాలలోనూ కనీస ప్రయోగ పరికరాలు ఉండాలి. ప్రయోగం అంటే కేవలం పదో తరగతిలో చేసే విన్యాసం కాకూడదు, అది నిరంతర ప్రక్రియ కావాలి. ప్రతి విద్యార్థిలోనూ ఒక ఫోకాల్ట్ ఉంటాడు. ఆ ఫోకాల్ట్‌ను నిద్రలేపాల్సింది మన విద్యావ్యవస్థే. మనం విద్యార్థులకు కేవలం సమాచారాన్ని అందించడం కాదు, ఆ సమాచారాన్ని విజ్ఞానంగా మార్చుకునే విశ్లేషణా శక్తిని అందించాలి. లియో ఫోకాల్ట్ గౌరవార్థం మనం ఇచ్చే నిజమైన నివాళి – మన పాఠశాలలను అన్వేషణాలయాలుగా మార్చడమే. అప్పుడే రేపటి తరం నుంచి గొప్ప ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలు ఉద్భవిస్తారు. కంఠస్థం చేసిన జ్ఞానం పరీక్షతో ముగుస్తుంది, కానీ ప్రశ్నించి నేర్చుకున్న జ్ఞానం చరిత్రను సృష్టిస్తుంది.

- ప్రొఫెసర్ ప్రవీణ్ యాదవ్



**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.